ప్రమాదకర నాలాలు..!

-కనిపించని రక్షణ గోడలు, ఫెన్సింగ్,హెచ్చరిక బోర్డులు

-గతేడాది జరిగిన విషాద ఘటనలు ఇంకా కళ్లముందే ...

-వర్షాలు ప్రారంభం కావడంతో సమీప ప్రాంత ప్రజల్లో భయం భయం

హైదరాబాద్,జూన్ 10,ప్రభాతవార్త: వర్షాకాలం వచ్చిందంటే చాలు నగరంలో నాళాలు ఉప్పొంగడం, కాలనీలు జలమయం కావడం, ప్రజలు ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని బతకడం సర్వసాధారణంగా మారింది. నాళాల వెంట రిటైనింగ్ వాల్స్ నిర్మిస్తామని, ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకుంటామని గతంలో ప్రకటించిన అధికారులు ఇప్పటి వరకు ఆ హామీలను అమలు చేయకపోవడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. గత ఏడాది జరిగిన విషాద ఘటనలు ఇంకా ప్రజల కళ్లముందే ఉండగా... ఈసారి మళ్ళీ వర్షాలు ప్రారంభం కావడంతో నాళా పరివాహక ప్రాంతాల ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. నాళాల్లో పేరుకుపోయిన చెత్త, మురుగు, ఆక్రమణలు కారణంగా నీటి ప్రవాహానికి ఆటంకం ఏర్పడి నాళాలు ఉప్పొంగుతున్నాయి. దీంతో సమీప కాలనీలు ముంపుకు గురవడమే కాకుండా ప్రజల ప్రాణాలకు కూడా ముప్పు ఏర్పడుతోంది. నగర వ్యాప్తంగా మొత్తం వెయ్యి కిలోమీటర్ల మేర నాలాలు ఉండగా అందులో 4వందల కిలోమీటర్ల మేర మేజర్ నాలాలు ఉండగా మిగతా 600 కిలోమీటర్ల మేర మైనర్ నాలాలు ఉన్నాయి. గత ఏడాది నాంపల్లి పరిధిలోని మల్లేపల్లి, అప్జల్ సాగర్ నాలాలో అర్జున్, రాము అనే ఇద్దరు వ్యక్తులు వరద ప్రవాహంలో కొట్టుకుపోయారు. వారిని రక్షించేందుకు జీహెచ్ఎంసి, హైడ్రా, విపత్తు నిర్వహణ బృందాలు విస్తృతంగా గాలించినప్పటికీ ఫలితం లేకపోయింది. వారం రోజుల తర్వాత వారి మృతదేహాలు నల్లగొండ జిల్లాలో బయటపడటం తీవ్ర విషాదాన్ని మిగిల్చింది. అదే విధంగా రాంనగర్ పార్శిగుట్ట ప్రాంతంలో మరో వ్యక్తి నాలాలో కొట్టుకుపోయి ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటనల అనంతరం నాళాల వద్ద రిటైనింగ్ వాల్స్ నిర్మిస్తామని, ప్రమాద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేస్తామని, ప్రజలు ప్రమాదవశాత్తు నాళాల్లో పడిపోకుండా ప్రత్యేక చర్యలు చేపడతామని అధికారులు ప్రకటించారు. 2020 లో నేరెడిమేట్ లో సైకిల్ మీద ఆడుకుంటున్న 12 ఏళ్ళ చిన్నారి సుమేధ నాలాలో లోపడి చనిపోయింది. ఆ ఘటనలో సైతం నాలకు రక్షణ గోడలు లేకపోవడమే కారణం. అప్పటి నుండి ఇప్పటివరకు నాలాలు ఎవరో ఒకరిని బలి తీసుకుంటూనే ఉన్నాయి. ఈ ప్రమాదాల్లో ప్రజల నిర్లక్ష్యం కొంత ఉంటె అధికారులు ప్రభుత్వాల అలసత్వము అధికంగానే ఉంది. కాగా.. గతేడాది అప్జల్ సాగర్ నాలా ఘటన తర్వాత అక్కడ నాలా వెంట ఉన్న ప్రజలకు మరో చోట ఇండ్లను కేటాయించి. ఆ ప్రాంతంలో నాలా పై ఉన్న ఇండ్ల నిర్మాణాలను తొలగించి వరద ముప్పు ప్రమాదానికి చెక్ పెడతామని అధికారులు, ప్రజా ప్రతినిధులు ప్రకటించారు. కానీ ఇప్పటి వరకు కనీసం ఆ ప్రాంతం నాలాల్లో చెత్తను కూడా తొలగించలేదు. అలాగే నాలాలో కొట్టుకుపోయిన వారి కుటుంబాలకు ప్రకటించిన పరిహారం కూడా ఇవ్వలేదని వారి కుటుంబ సభ్యులు వాపోతున్నారు.

ప్రమాదాలు జరిగితేనే స్పందిస్తారా..?

అయితే ఏడాది గడిచినా పరిస్థితిలో పెద్దగా మార్పు కనిపించడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. మరో వర్షాకాలం ప్రారంభమైనా అనేక ప్రాంతాల్లో నాళాల పక్కన రక్షణ గోడలు కనిపించడం లేదు. ప్రమాదకర ప్రాంతాల్లో ఫెన్సింగ్, హెచ్చరిక బోర్డులు, భద్రతా ఏర్పాట్లు కూడా పూర్తిస్థాయిలో అమలు కాలేదని చెబుతున్నారు. కేవలం అధికారులు, నాయకులు వచ్చి మాటలు చెప్పి వెళ్లిపోవడమే తప్పా తమకు ఎలాంటి పరిస్కారం చూపించడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షం కురిసిన ప్రతీ సారి ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని భయంభయంగా గడుపుతున్నామని., నాళా ఉప్పొంగి ఇంట్లో కి నీళ్లు వస్తే.. చిన్న పిల్లలతో బయటకు వెళ్లి రోడ్డు ప్రక్కన కూర్చొని, నీళ్లు వెళ్ళిపోయాక ఇంట్లోకి వస్తామని తమకు మరే ఆధారం లేదని అక్కడి నివసితులు వెల్లడిస్తున్నారు.గతంలో జరిగిన విషాద ఘటనలు ప్రజలను ఇప్పటికీ వెంటాడుతున్నాయి. ప్రమాదాలు జరిగిన తర్వాత హామీలు ఇవ్వడం కాకుండా, ముందస్తుగా రిటైనింగ్ వాల్స్ నిర్మించడం, నాళాల సామర్థ్యాన్ని పెంచడం, భద్రతా చర్యలు చేపట్టడం ద్వారా ప్రాణనష్టాన్ని నివారించాలని నాళా పరివాహక ప్రాంతాల ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. మరో సారి భారీ వర్షాలు కురిసే ముందు అధికారులు మేల్కొంటారా..? లేక మళ్లీ ప్రమాదాలు జరిగిన తర్వాతే స్పందిస్తారా అన్నది ఇప్పుడు ప్రశ్నార్థకంగా మారింది.

హైదరాబాద్ వార్త

బాక్స్‌డ్రైన్ నిర్మాణాలు...నాణ్యతకు తిలోదకాలు

- పట్టించుకోని అధికారులు

- ఇష్టారాజ్యంగా కాంట్రాక్టర్లు

చాంద్రాయణగుట్ట, జూన్ 10, ప్రభాతవార్త : జీహెచ్ఎంసి చార్మినార్, రాజేంద్రనగర్ జోన్లలోని పలు సర్కిళ్ళలో కొనసాగుతున్న బాక్స్‌డ్రైన్ (కచ్చామోరీల) నిర్మాణాలలో నాణ్యత ప్రమాణాలకు పాతరేస్తున్నారు. కొందరు కాంట్రాక్టర్లు ఇష్టారాజ్యంగా నాసిరకం పనులు చేపడుతున్నారు. ఆయా సర్కిళ్ల ఇంజనీరింగ్ విభాగం అధికారులు పనులను పట్టించుకోవటం లేదు. కనీసం అటువైపు తిరిగి చూడటం లేదు. పనులు ఎలా జరుగుతున్నాయి, ప్రమాణాలు పాటిస్తున్నారా లేదాని తనిఖీలు నిర్వహించటం లేదు. కాంట్రాక్టర్ కనుసైగల్లో సిబ్బంది పనులు కానిచ్చేస్తున్నారు. లక్షలాది రూపాయల ప్రజాధనం దుర్వినియోగం చేస్తున్నారు. ఆయా బస్తీవాసులు ప్రశ్నిస్తే కఠినంగా మాట్లాడుతున్నారు. ఎవరేమన్నా కూలీలు తాము చేయాల్సిన విధంగా చేస్తున్నారు. నాణ్యతా ప్రమాణాలను పక్కన పెడుతున్నారు. రాజేంద్రనగర్ జోన్‌లోని పలు బస్తీలలో పాత ఎస్‌డబ్ల్యూ డ్రైన్ స్థానంలో ఆధునిక బాక్స్ డ్రైన్లను నిర్మిస్తున్నారు. పగలు, రాత్రనకు పనులు చేపడుతూ పైప్‌లైన్లను ఏర్పాటు చేస్తున్నారు. జెసీబీల సహాయంతో తవ్విపోస్తున్నారు. మంచినీరు, డ్రైనేజీ పైప్‌లైన్ల ధ్వంసం చేస్తున్నారు. ఒకవైపు మురుగు నీరు పారుతుంటే అందులోనే పైపులు కూర్చోబెడుతున్నారు. కనీసం లేవల్ కూడా చూడకుండా పైప్‌లు వేస్తున్నారు. రెండు పైపులు కలిసే చోట జాయింట్లను సరిగా కలపటం లేదు. వాటి మధ్య దూరం నాలుగైదు అంగుళాలున్నా వాటిలో ఖాళీ సిమెంట్ సంచులను, రాళ్లు, మట్టి పెళ్లలు, కాగితాలను దూర్చి వాటిపై తొవ్విన మట్టితో కప్పేస్తున్నారు. ప్రతి రెండు పైపుల మధ్య నిర్మించే బాక్స్ మ్యాన్‌హోళ్లు పూర్తిగా నాసిరకంగా ఉంటున్నాయి. మ్యాన్‌హోళ్లను చతురస్రాకారంగా తవ్వకుండా జేసీబీతో గోయి తీస్తున్నారు. దాంట్లో సెంట్రింగ్ బక్సులను పెట్టి చుట్టూర మట్టి, సీసీరోడ్డు శిథిలాలు, నామ్కేవాస్తేగా అక్కడక్కడ కనిపించే కంకర, సిమెంట్, ఇసుక మిశ్రంతో నింపేస్తున్నారు. పైన ఇసుక, సిమెంట్ మిశ్రమంతో చతురస్రాకారంలో చదును చేస్తున్నారు. వాటికి క్యూరింగ్ చేయకుండానే మ్యాన్‌హోల్ కవర్లను బిగిస్తున్నారు. వాటిలో పడ్డ రాళ్లు, రప్పలు, మట్టి పెళ్లలను అలాగే వదిలేస్తున్నారు. కొన్నిచోట్ల పచ్చిగా ఉన్న మ్యాన్‌హోళ్ళపై నుండి జెసిబి, ట్రాక్టర్లు వెళ్ళి బీటలు పారాయి, కొన్ని కృంగి పోయాయి. అయినా అవేమి పట్టించుకోకుండా పాత, కొత్త మ్యాన్‌హోల్ కవర్లను కలిపి అమర్చుతున్నారు. భవిష్యత్‌లో వీటిపై నుండి భారీ వాహనాలు వెళితే కృంగిపోయే ప్రమాదం ఉంది. కచ్చామోరీలోని మురుగు ముందుకు వెళ్ళలేక రోడ్లపై ప్రవహించనుంది. అదేవిధంగా తవ్వేసిన రోడ్డు స్థానంలో కొత్త సీసీ రోడ్డు నిర్మాణం కోసం చేపట్టే లేవలింగ్ అంతా లేబర్లే చూసుకుంటున్నారు. ఎత్తు పల్లాలతో అస్తవ్యస్తంగా మట్టిని నేర్పుతున్నారు. దీనిపై నుండి రాత్రివేళ సీసీరోడ్డు వేస్తే వరద, మురికినీరు బస్తీలో ఎటు పడితే అటూ ప్రవహించే అవకాశం ఉంది. మట్టిరోడ్లను సమాంతరంగా చదును చేస్తే వర్షం నీరు, వరద దిగువకు, మ్యాన్‌హోళ్ళలోకి వెళ్లే అవకాశం ఉంది. జీహెచ్ఎంసి ఇంజనీరింగ్ విభాగం అధికారులు పనులను కాంట్రాక్టరుకు, కాంట్రాక్టర్ లేబర్లకు వదిలేస్తున్నారు. దీంతో అభివృద్ధి పనులలో నాణ్యతా ప్రమాణాలు లోపించి మున్నాళ్ల ముచ్చటగా మారుతున్నాయి. లక్షలాది రూపాయల ప్రజాధనం దుర్వినియోగం అవుతుంది. కొంత మంది అధికారులు అవినీతికి పాల్పడుతూ పనుల నాణ్యతను పరిశీలించకుండానే బిల్లులు మంజూరు చేస్తున్నారు. నాసిరకం పనులతో చేసిన వాటినే మళ్ళిమళ్ళి చేస్తూ జేబులు నింపుకుంటున్నారు.

ఆధునికత పేరుతో నిర్మిస్తున్న బాక్స్‌డ్రైన్ నిర్మాణం, ఉపయోగించే మెటీరియల్ పూర్తిగా నాసిరకంగా ఉంటుంది. వీటికన్నా పాత పద్ధతే మేలనే అభిప్రాయం వ్యక్తమవుతుంది. ఇక అధికారులకు, కాంట్రాక్టర్లకు పండుగలు కలిసి వస్తున్నాయి. కనీసం ఆయా సర్కిల్ అధికారులు జరుగుతున్న అభివృద్ధి పనులను తరచూ పరిశీలించి, లోపాలపై కింది స్థాయి అధికారులను, కాంట్రాక్టర్లను ఎప్పటికప్పుడు మందలిస్తే కొంత వరకైన అక్రమాలు, నాసిరకం పనులు నియంత్రణలో ఉండే అవకాశం ఉంది. జీహెచ్ఎంసిపై ఎప్పటి నుండో ఉన్న 'ఖావో...ఖిలావో' అన్న నానుడి నేటికి కొనసాగుతుండటం బల్దియా పని తీరును తెలియజేస్తుంది.

నాణ్యతా ప్రమాణాలు పాటించకుండా నిర్మిస్తున్న బాక్స్‌డ్రైన్ మ్యాన్‌హోల్

పారిశుద్ధ్య నిర్వహణ మరింత బలోపేతం

-"నో బిన్ - నో ట్రేడ్" విధానం కఠినంగా అమలు

-సిఎంసి కమిషనర్ సృజన

హైదరాబాద్, జూన్ 10, ప్రభాతవార్త: సైబరాద్ కార్పొరేషన్ పరిధిలోని అన్ని వార్డుల్లో పారిశుద్ధ్య నిర్వహణను మరింత బలోపేతం చేయాలని, క్షేత్రస్థాయిలో నిరంతర పర్యవేక్షణతో స్వచ్ఛఆటోలు .. ప్రతిరోజూ తప్పనిసరిగా చెత్తసేకరణ చేసేవిధంగా చూడాలని, దీర్ఘకాలంగా విధులకు హాజరు కాని పారిశుద్ధ్య కార్మికులను గుర్తించి నివేదిక అందించాలని సిఎంసి కమిషనర్ జి.సృజన అధికారులను ఆదేశించారు. ఈమేరకు న్యాక్‌బిల్డింగ్‌లోని సిఎంసి కార్యాలయంలో శానిటేషన్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నో బిన్ - నో ట్రేడ్".. విధానాన్ని కఠినంగా అమలు చేయాలని, వ్యాపార సంస్థల్లో వ్యర్థాల నిర్వహణ పట్ల బాధ్యత పెంపొందించాలని ఆదేశించారు. ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం విధించే జరిమానాలకు సంబంధించిన నివేదికలను ప్రతిరోజూ సమర్పించాలని సూచించారు. అలాగే హెచ్ఎండబ్ల్యూఎస్ఎస్‌బీ అధికారులతో కలిసి అన్ని వార్డుల్లో సంయుక్త తనిఖీలు నిర్వహించాలని కమిషనర్ ఆదేశించారు. ప్రతి జోన్‌లోని వార్డులన్నింటినీ జూన్ నెలాఖరులోగా జోనల్ కమిషనర్లు సందర్శించి, గుర్తించిన సమస్యలపై చర్యల నివేదికలను సమర్పించాలని సూచించారు. వ్యర్థాల నిర్వహణలో భాగంగా ..డ్రై వేస్ట్, వెట్ వేస్ట్, శానిటరీ వేస్ట్, స్పెషల్ కేర్ వేస్ట్.. అనే నాలుగు రకాల వ్యర్థాల వేరు వేరు సేకరణను సమర్థవంతంగా అమలు చేయాలని కమిషనర్ ఆదేశించారు.పారిశుద్ధ్య సేవలను మరింత మెరుగుపరిచేందుకు శానిటేషన్ సిబ్బంది నియామకం మరియు వినియోగంపై సమగ్ర కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేయాలని అధికారుల ను ఆదేశించారు. అలాగే ..నిర్మాణ మరియు కూల్చివేత వ్యర్థాలు (సిఅండ్‌డి) ఇతర భారీ వ్యర్థాల సేకరణను మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు అవసరమైన ప్రతిపాదనలను పంపానలన్నారు. పరిశుభ్రం, ఆరోగ్యకరమైన పర్యావరణ హిత సైబరాబాద్ నిర్మాణమే కార్పొరేషన్ లక్ష్యమని, అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి పారిశుద్ధ్య ప్రమాణాలను మరింత మెరుగుపరచాలని సూచించారు.

సమావేశంలో మాట్లాడుతున్న సిఎంసి కమిషనర్ జి.సృజన

15 ఎకరాల ప్రభుత్వ భూమికి రక్షణ

-హైకోర్టు తీర్పుమేరకు చర్యలు ..చుట్టూ పెన్సింగ్

-దాని విలువ సుమారు రూ. 3 వేల కోట్లు

హైడ్రా ఫెన్సింగ్ ఏర్పాటు చేస్తున్న ప్రభుత్వం భూమి

హైదరాబాద్, జూన్ 10,ప్రభాతవార్త: మాదాపూర్ సైబర్‌టవర్స్‌కు చేరువలో 15 ఎకరాల ప్రభుత్వ భూమిని హైడ్రా కాపాడింది. దాదాపు 3 వేల కోట్ల విలువైన భూమి చుట్టూ బుధవారం ఫెన్సింగ్ వేసింది. హైకోర్టు తీర్పు మేరకు హైడ్రా ఈ చర్యలు తీసుకుంది. రంగరెడ్డి జిల్లా శేరిలింగంపల్లి మండలం ఖానామెట్ విలేజ్‌లోని 41/12, 13, 14 సర్వే నంబర్లలో మొత్తం 15 ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. అయితే ఈ భూమి తమదంటూ ఇట్టినా ప్రాపర్టీస్ సంస్థ క్లైమ్ చేస్తూ వస్తోంది. ఆ భూములను ఖాళీ చేయాలని కోరుతూ 2016లో టీజీఐఐసీ వాళ్లు ఇట్టినా ప్రాపర్టీస్ సంస్థకు నోటీసులు జారీ చేశారు. ఈ నోటీసులను సవాల్ చేస్తూ ఇట్టినా సంస్థ హైకోర్టును ఆశ్రయించింది. దీనిపై జస్టిస్ నగేశ్ భీమపాక విచారణ చేపట్టి తీర్పు వెలవరిస్తూ.. దశాబ్దం నాటి వివాదానికి తెరదించారు. మాజీ సైనికుల కోటా కింద ప్రభుత్వం 1963లో కేటాయించినట్టు ఎక్కడా ఆధారాలు లేవని.. పిటిషనర్ సమర్పించిన పట్టా పత్రాలు నకిలీవని రెవన్యూ అదికారులు ఆధారాలతో కోర్టుకు నివేదించారు. అప్పటి రాజేంద్రనగర్ తహసీల్దార్ కార్యలయం 1978లో ఏర్పాటు కాగా.. ఆ కార్యలయం పేరుతో 1972, 1973 సంవత్సరాలలో పట్టా పత్రాలు ఎలా వస్తాయని రెవెన్యూ అధికారులు పేర్కొన్నారు. ఆర్‌వోఆర్ చట్ట ప్రకారం ప్రొసీడింగ్స్‌ను తహసీల్దార్ జారీ చేయాల్సి ఉండగా.. ఈ కేసులో రికార్డింగ్ ఆఫీసర్ యూడీఐఆర్ శేరిలింగంపల్లి మండలం పేరుతో జారీ అయ్యాయని.. ఇవి ఏ చట్టం కింద జారీ అయ్యాయో కూడా తెలియదన్నారు. ప్రొసీడింగ్స్ జారీ చేసిన అధికారి పేరు పి. నరసింహా రావు అని ఉందని..

కానీ ఆ పేరుగల అధికారి అక్కడ పని చేసినట్టు రికార్డులు లేవని.. రుజువు చేశారు. ఇలా నకిలీ పత్రాలతో ప్రభుత్వ భూమిని కొట్టేయాలని పిటిషనర్లు ప్రయత్నిస్తున్నారని కోర్టు నిర్ధారించుకుని.. ఆ భూములను రక్షించాలని రెవెన్యూ అదికారులను ఆదేశించింది. రెవెన్యూ అధికారుల విజ్ఞప్తి మేరకు 15 ఎకరాల ప్రభుత్వ భూమిని కాపాడుతూ హైడ్రా ఫెన్సింగ్ వేసింది. ప్రభుత్వ భూమిగా పేర్కొంటూ బోర్డులు ఏర్పాటు చేసింది.

అమీర్‌పేట్ ఆసుపత్రిలో డిఎంహెచ్‌వో ఆకస్మిక తనిఖీ

రిజిస్టర్ పరిశీలిస్తున్న డిఎంహెచ్‌వో పుట్ల శ్రీనివాస్

హైదరాబాద్, జూన్ 10,ప్రభాతవార్త: ప్రభుత్వ ఆసుపత్రుల్లో రోగులకు మెరుగైన వైద్య సేవలు అందాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ పుట్ట శ్రీనివాస్ ఆదేశించారు. ఈమేరకు బుధవారం అమీర్‌పేట్‌లోని పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాతా శిశు సంరక్షణ, వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమం, నాన్ కమ్యూనికేబుల్ డిసీస్, కమ్యూనికేబుల్ డిసీస్ కార్యక్రమాన్ని సమీక్షించారు. వివిధ ఆరోగ్య కార్యక్రమాలు, పథకాలను సకాలంలో పూర్తి చేయాలని సూచించారు. ఈసందర్భంగా హాజరు రిజిస్టర్ పరిశీలించి వైద్యులు, సిబ్బంది సమయపాలన తప్పక పాటించాలనిసూచించారు.ఈ కార్యక్రమంలో అమీర్పేట్ క్లస్టర్ సీనియర్ పబ్లిక్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ హేమలత, జిల్లా మాస్ మీడియా అధికారి జక్కుల రాములు, ఆంజనేయులు సిబ్బంది పాల్గొన్నారు.

మంత్రి దామోదర రాజనర్సింహ్మాను కలిసిన పుట్ల శ్రీనివాస్ ...

హైదరాబాద్ జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారిగా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన డా. పుట్ల శ్రీనివాస్, రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహను బుధవారంమర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా జిల్లాలోని వైద్య ఆరోగ్య సేవలు, ప్రజారోగ్య కార్యక్రమాల అమలు, ప్రభుత్వ ఆసుపత్రుల్లో అందుతున్న సేవల మెరుగుదల తదితర అంశాలపై మంత్రితో చర్చించినట్లు సమాచారం. కొత్త బాధ్యతలు చేపట్టిన డా. పుట్ల శ్రీనివాస్‌కు మంత్రి శుభాకాంక్షలు తెలియజేసి, ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు కృషి చేయాలని సూచించారు. హైదరాబాద్ జిల్లాలో ప్రజారోగ్య కార్యక్రమాలను మరింత సమర్థవంతంగా అమలు చేస్తూ, ప్రభుత్వ వైద్య సేవలను ప్రజలకు చేరువ చేయడంలో తన వంతు కృషి చేస్తానని డా. పుట్ల శ్రీనివాస్ తెలిపారు.

మాజీ ఐపీఎస్ ఇంట్లో దోపిడి కేసులో 'సీన్ రీకన్‌స్ట్రక్షన్'

- కస్టడీ నిందితులను విచారిస్తున్న పోలీసులు

జూబ్లీహిల్స్, జూన్ 10, ప్రభాతవార్తః జూబ్లీహిల్స్ ప్రశాసన్‌నగర్‌లో నివసించే మాజీ ఐపీఎస్ వినయ్ రంజన్ రే నివాసంలో దోపిడి, హత్య కేసు సంఘటనలో పోలీసులు కస్టడీలో ఉన్న నిందితులతో 'సీన్ రీకన్‌స్ట్రక్షన్'(నేర సంఘటన పునర్నిర్మాణం) చేశారు. మే 8న వినయ్ రంజన్ రే సతీమణి తనూజ రంజన్‌ను హతమార్చి బంగారు ఆభరణాలను నేపాలి ముఠా దోచుకెళ్లిన సంగతి విదితమే. ఈ సంఘటనలో జూబ్లీహిల్స్ పోలీసులు నిందితుల్లో ఒకరైన సునీల్ పరియార్‌తోపాటు ఆభరణాల రిసీవర్ దిలీప్‌లను అరెస్ట్ చేసి అయిదు రోజుల క్రితం కస్టడీకి తీసుకున్నారు. ఈ క్రమంలోనే కస్టడీలో ఉన్న నిందితులను మూడు రోజుల పాటు విచారించిన పోలీసులు వారి నుంచి సరైన సమాచారాన్ని రాబట్టేందుకు ఈ సీన్ రీకన్‌స్ట్రక్షన్ చేశారు. ఇందులో భాగంగా తొలుత నిందితులిద్దరిని జూబ్లీహిల్స్ ప్రశాసన్ నగర్‌లోని నివాసానికి తీసుకెళ్లారు. వారు ఎక్కడి నుంచి మాజీ డీజీపీ నివాసం వద్దకు చేరుకున్నారు, ఎవరెవరు ఎక్కడ వేచి ఉన్నారు, ఇంట్లోకి ఎలా వెళ్లారు, సంఘటన అనంతరం ఎవరెవరు కలిసి వెళ్లారు, ఏ వైపు నుంచి వెళ్లారనే అంశాలను వారిని అడిగి తెలుసుకున్నారు. సంఘటనలో పాల్గొన్న సునీల్‌ను ఈ విషయంలో లోతుగా విచారించి వివరాలు రాబట్టారు. కల్పనతోపాటు తాను మరో ఇద్దరు ఇంట్లోకి వెళ్లామని, మరో నలుగురు పార్కు వైపు వేచి ఉన్నట్లు పోలీసుల దృష్టికి తీసుకొచ్చాడు. సంఘటన అనంతరం నిందితులు కాజీపేటకు పారిపోవడంతో నిందితులిద్దరిని తీసుకొని పోలీసులు కాజీపేటకు సైతం వెళ్లారు. అక్కడ ఎక్కడెక్కడికి వెళ్లారు, ఎక్కడెక్కడ తిరిగారు, ఎవరినైనా కలిశారా అనే కోణంలోనూ విచారించారు. నిందితులు కాజీపేట తరువాత పూణేకు వెళ్లడం అక్కడ నగలను రిసీవర్ అయిన దిలీప్‌కు అప్పగించడంతో పూణేకు సైతం వెళ్లాలని పోలీసులు భావిస్తున్నారు. కస్టడీ మరో అయిదు రోజులు ఉండటంతో అవసరమైన ముఖ్య సమాచారాన్ని అంతా రాబట్టాలని పోలీసులు భావిస్తున్నారు. మరోవైపు ఇప్పటికే సంఘటనలో పాల్గొన్న కొందరు నిందితులు నేపాల్ హద్దుల్లోకి వెళ్లిపోవడంతో వారిని ఎలా తీసుకొని రావలనే అంశంపై పోలీసు బాస్‌లు దృష్టి పెట్టారు. నిందితులు భారత సరిహద్దులు దాటినట్లు పోలీసులకు స్పష్టమైన ఆధారాలు సైతం లభించాయి. మరికొందరు ఇక్కడ తలదాచుకున్నట్లు అనుమానిస్తున్నారు. వారిని పట్టుకొనేందుకు ప్రయత్నిస్తున్నారు.

నిందితులు సునీల్ పరియార్, దిలీప్.

ఖాజాగూడ చెరువుకు వరదనీరు చేరేలా ఏర్పాట్లు

కాలువలను పరిశీలించిన హైడ్రా కమిషనర్ రంగనాథ్

హైదరాబాద్, జూన్ 10,ప్రభాతవార్త: ఐటీ కారిడార్లో వరద ఇబ్బందులు తొలగించడంపై హైడ్రా దృష్టి సారించింది. ఐకియా, దుర్గం చెరువు మాధాపూర్ ఐటీ కారిడార్ నుంచి వచ్చే వరద నీరు నేరుగా చెరువుల్లోకి చేరకుండా రహదారులను ముంచెత్తడంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయని గ్రహించింది. ఐకియా, గచ్చిబౌలి ప్రాంతాల నుంచి వచ్చిన వరద నేరుగా ఖాజాగూడ చెరువులోకి చేరేలా చర్యలు తీసుకోవాలని హైడ్రా కమిషనర్ రంగనాథ్ సూచించారు. ఈ నీరు ఖాజాగూడ చెరువుకు వెళ్లకుండా రహదారి మీదుగా మల్కం చెరువు వరకు చేరడంతో అక్కడ కూడా వరద పోటెత్తుతోందని పేర్కొన్నారు. మంగళవారం కురిసిన వర్షంతో నగరంలో చాలా చోట్ల వరద నీరు పోటెత్తడంపై కమిషనంరంగనాథ్ బుధవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఆ క్రమంలో ఖాజాగూడ చెరువుకు వెళ్లే వరద కాలువలను తనిఖీ చేశారు. మురుగు నీరు ఎస్‌టీపీలకు.. వరద నీరు పెద్దమొత్తంలో వస్తే నేరుగా చెరువులోకి చేరేలా ఏర్పాట్లు చేస్తే ఈ ఇబ్బంది తలెత్తదని.. ఆదిశగా చర్యలు తీసుకోవాలని అక్కడ మున్సిపల్, ఇరిగేషన్, హైడ్రా అధికారులకు కమిషనర్ సూచించారు. వరద కాలువల్లో పేరుకుపోయిన పూడికను వెంటనే తొలగించాలని.. ఈ ప్రక్రియ వర్షాకాలం అయ్యేవరకూ కొనసాగాలని సూచించారు. ఎన్నికల కమిషన్ కార్యాలయం పరిసరాల్లో ఉన్న బాక్స్ డ్రెయిన్ సైజు తగ్గడంవల్ల డిశ్చార్జ్ సామర్థం తగ్గినట్లు అధికారులు గుర్తించారు. వరద ముంచెత్తే సమస్య తొలగాలంటే.. వరద నీరు నేరుగా చెరువులకు చేరే వ్యవస్థ ఉండాలన్నారు. వరద నీటి సామర్థ్యానికి తగ్గట్టు కాలువలు లేకపోవడంతో వరద రహదారులను ముంచెత్తుతోందని పేర్కొన్నారు. మెట్ టీమ్‌లు అందుబాటులోకి త్వరలో రానున్నాయని.. డీసిల్టింగ్ పనులను నిరంతరంగా సాగిస్తామన్నారు. నగరంలో నీటిముంపు సమస్యలను శాశ్వతంగా తగ్గించాలంటే చెరువులు, నాలాలు, స్టార్మ్ వాటర్ డ్రెయిన్లను సమగ్రంగా అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందన్నారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని ఐటీ కారిడార్ ప్రాంతంలో నీటి నిల్వ, ట్రాఫిక్ అంతరాయాలు, నీటిముంపు సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని, చెరువులు నాలాలుడ్రెయిన్ల అనుసంధాన వ్యవస్థ సమర్థంగా పనిచేసేలా అన్ని శాఖలు సమన్వయంతో పని చేయాలని కమిషనర్ అధికారులను ఆదేశించారు.

వరదనీరు వెళ్లే మార్గాలను పరిశీలిస్తున్న హైడ్రా కమిషనర్ రంగనాథ్

ఫీజుల నియంత్రణకు కఠిన చర్యలు చేపట్టాలి

ప్రైవేటు పాఠశాలల ఫీజుల నియంత్రణ చేయాలంటూ ఎంఈఓ కు వినతి పత్రం అందిస్తున్న ఏబీవీపీ నేతలు.

బేగంపేట జూన్ 10,ప్రభాతవార్త

ప్రయివేటు పాఠశాలల్లో ఫీజుల నియంత్రించేందుకు కఠిన చర్యలు చేపట్టాలని కోరుతూ అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ సికింద్రాబాద్ జిల్లా ఆధ్వర్యంలో మండల విద్యాధికారి(ఎంఈఓ)కు వినతి పత్రం సమర్పించారు.ఈ సందర్భంగా ఏబీవీపీ సికింద్రాబాద్ జిల్లా కన్వీనర్ చర్కబాలకృష్ణ మాట్లాడుతూ ప్రస్తుత రోజుల్లో కార్పోరేట్ ,ప్రైవేటు పాఠశాలలు ఇష్టాను సారంగా అధిక ఫీజులు వసూలు చేస్తూ సామన్య తల్లిదండ్రులపై తీవ్ర ఆర్థిక భారం మోపుతున్నాయని ఆందోళన వ్యక్తం చేసారు.గతంలో ప్రభుత్వం నిర్ధేశించిన ఫీజు నియంత్రణ నిబంధనలను విధ్యాశాఖ అధికారులు కఠినంగా అమలు చేయాలని,నిబంధనలను విధ్యాశాఖ అధికారులు క్షేత్ర స్థాయిలో కఠినంగా అమలు చేయాలన్నారు.నిబంధనలను పట్టించుకోకుండా విధ్యా వ్యాపారానికి పాల్పడుతున్న యాజమాన్యాలపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు.అలాగే కొన్ని ప్రయివేటు పాఠశాలలు తమ పాఠశాలల పేర్లతో ముద్రించిన ప్రత్యేక పాఠ్యపుస్తకాలు,నోట్‌బుక్స్,స్కూలు యూనిఫామ్స్,ఇతర సామాగ్రిని తమ వద్దే కొనుగోలు చేయాలంటూ తల్లిదండ్రులను బలవంతం చేస్తున్నాయని,బాలకృష్ణ ఆరోపించారు.అలాగే ప్రభుత్వ పాఠశాలల్లో తాగునీరు,నాణ్యమైన మరుగుదొడ్లు,డిజిటల్ తరగతుల వంటి అన్ని రకాలైన మౌళిక వసతులను కల్పించాలని విజ్ఞప్తి చేసారు. ప్రైవేటు పాఠశాలలు నిబంధనలకు లోబడి నడుచుకునేలా చర్యలు చేపట్టాలని వారు కోరారు.కార్యక్రమంలో గౌతమ్,అశోక్, హర్షవర్ధన్, అభినయ్, హర్ష,వికాస్,రామ్, రాకేష్,విద్యార్థి నాయకులు పాల్గొన్నారు.

యుజిడి పనులకు ఎమ్మెల్యే మర్రి శంకుస్థాపన

యుజిడి పనులు ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే

అల్వాల్, జూన్ 10 ప్రభాతవార్త:

మౌలిక వసతులు కల్పించేందుకు ప్రణాళికాబద్ధమైన చర్యలు తీసుకుంటున్నామని మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి పేర్కొన్నారు. బుధవారం ఇందిరానగర్, ప్రశాంత్ నగర్‌లలో ఏర్పాటు చేయనున్న యుజిడి పనులను స్థానిక మాజీ కార్పొరేటర్ శాంతి శ్రీనివాస్ రెడ్డితో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. ప్రజా సమస్యలు పరిష్కరించేందుకు శక్తి వంచన లేకుండా ప్రయత్నిస్తున్నట్లు మర్రి రాజశేఖర్ రెడ్డి పేర్కొన్నారు. అధికార యంత్రాంగం అభివృద్ధి పనులు పూర్తి చేసేందుకు చిత్తశుద్ధితో పని చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ నేత సాజిద్ కాలనీ వాసులు పాల్గొన్నారు.

శారీరక దారుఢ్యం అత్యవసరం : జితేందర్‌నాథ్

ఓపెన్ జిమ్ పనులు ప్రారంభిస్తున్న మాజీ కార్పొరేటర్

అల్వాల్, జూన్ 10 ప్రభాతవార్త: శారీరక దారుఢ్యం అత్యవసరమని మచ్చబొల్లారం మాజీ కార్పొరేటర్ జితేందర్‌నాథ్ పేర్కొన్నారు. బుధవారం డివిజన్ పరిధిలోని మంగాపురం, ప్రెసిడెన్సీ కాలనీలులో 22 లక్షలు వ్యయంతో ఏర్పాటు చేయనున్న ఓపెన్ జిమ్ పనులను మాజీ కార్పొరేటర్ ప్రారంభించారు. మానవుని జీవన విధానంలో శారీరక దారుఢ్యానికి విశిష్ట స్థానాన్ని ఇవ్వాలల్సిన అవసరం ఉందని జితేందర్‌నాథ్ పేర్కొన్నారు. ప్రతి రోజు కొంత సమయాన్ని తమ శరీరం కోసం శ్రమించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో కాలనీ వాసులుతో పాటుగా కాంగ్రెస్ నేతలు సురేందర్ రెడ్డి, శ్రీశైలం, కొండల్ రెడ్డి, శ్రీనివాస్ గౌడ్, లడ్డు రెడ్డి పాల్గొన్నారు.

తెలుగు సంస్కృతి, కళలకు కృష్ణాది శేషు విశేష సేవలు

-దక్షిణ మధ్య రైల్వే పూర్వ జనరల్ మేనేజర్ రామకృష్ణ

చిక్కడపల్లి జూన్ 10 (ప్రభాతవార్త) :

మూడు దశాబ్దాలకు పైగా అంతర్జాతీయ స్థాయిలో తెలుగు సంస్కృతి, కళలకు విశేష సేవలు అందిస్తున్న సమీకృత అంతర్జాతీయ తెలుగు సాంస్కృతిక సారస్వత సంఘం (ఇట్కాలా) అధినేత , సంస్కృతి రత్న డాక్టర్ కె.ధర్మారావు ఆధ్వర్యంలో వాస్తు ప్రవీణ పి.కృష్ణాది శేషు అభినందన సత్కార కార్యక్రమం బుధవారం జరిగింది. డాక్టర్ ధర్మారావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ ఉన్నతాధికారి గా పనిచేస్తూనే, దశాబ్దాలుగా వాస్తు శాస్త్రంలో మెళకువలను వివిధ మాధ్యమాల ద్వారా లక్షలాది మందికి కృష్ణాది శేషు చేరువ చేశారని కొనియాడారు. తెలుగు విశ్వవిద్యాలయం లో పీజీ వాస్తు కోర్సుల సలహా కమిటీ సభ్యుడిగా ఆయన అందించిన సేవలు, విదేశీ వాస్తు ప్రేమికుల నుంచి ఆయన పొందిన ప్రశంసలు ఆయన అపారమైన వాస్తు పరిజ్ఞానానికి నిదర్శనమని పేర్కొన్నారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న రైల్వే పూర్వ జనరల్ మేనేజర్, కళారత్న సి.రామకృష్ణ మాట్లాడారు. ప్రముఖ కథా, నవలా రచయిత ఏ.వి.మోహనరావు,టీవీ,సినీ నటుడు సరిపల్లి రాజు తదితరులు పాల్గొన్నారు. కృష్ణాది శేషు మాట్లాడుతూ..తనకు లభించిన గౌరవం పట్ల ఇ ట్కాలా సంస్థకు ధన్యవాదాలు తెలిపారు.త్వరలోనే తాను రాసిన వాస్తు వ్యాసాలను,పాఠకుల ప్రశ్నలకు ఇచ్చిన సమాధానాలను ఆసక్తిక రమైన చిత్రాలతో కూడిన గ్రంథరూపంలో ప్రచురించనున్నట్లు వెల్లడించారు.

ఉద్యోగులకు ప్రత్యేక గుర్తింపు : బెజ్గామ్

గన్‌ఫౌండ్రి,జూన్ 10ప్రభాతవార్త: తమ సంస్థ ఉద్యోగులకు అనిన విధాలుగా సహాయ సహకారాలను ఎల్ల వేళలా అందిస్తుందని వాసు గ్రూపు సిఈవో బెజ్గామ్ శ్రీనివాస్,మేనేజింగ్‌డైరెక్టర్ బెజ్గామ్ రమేష్‌లు పేర్కొన్నారు.ఉద్యోగుల ఆహ్లాదం కోసం ప్రతి సంవత్సరం నిర్వహించే వాసు ప్రీమియర్ లీగ్ క్రికెట్ పోటిలు ముగిశాయి.ఈసందర్భంగా వారు మాట్లాడుతూ తాము ఏడాది పొడవున ఏదో స్వచ్ఛంద,ఆధ్యాత్మిక కార్యక్రమాలను నిర్వహిస్తామన్నారు. బెజ్గామ్ బాన్ మూర్తి జ్ఞాపకార్థం వాసు క్రికెట్ పోటిలను నిర్వహించడం జరుగుతుందన్నారు.క్రికెట్ ఫైనల్ మ్యాచ్‌లో గెలుపు పొందిన జట్టుకు ట్రోఫి బహుకరించారు.ఈకార్యక్రమంలో అరవింద్, అభినయ్,అక్షయ్,అనీస్ తదితరులు పాల్గొన్నారు.

తెలుగుప్రజల హృదయాలను దోచుకున్న మహాగాయకుడు ఎస్‌పి బాలు

చిక్కడపల్లి జూన్ 10 (ప్రభాతవార్త) : ఐదు దశాబ్దాలకు పైగా తన మధుర గానంతో కోట్లాది సంగీతాభిమానుల హృదయాలను గెలుచుకున్న గానగంధర్వుడు, పద్మభూషణ్ ఎస్.పి. బాలసుబ్రహ్మణ్యం అని ఎస్ పి బి మ్యూజిక్ అకాడమీ ఛైర్మన్ డాక్టర్ హరి ఇప్పనపల్లి, అధ్యక్షుడు శ్రీనివాస్ గూడూరు, ఉపాధ్యక్షురాలు రాజీ బుర్ర అన్నారు. బుధవారం ఎస్ పి బాలసుబ్రహ్మణ్యం 80వ జయంతి సందర్భంగా తెలుగు సమాజం ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకలు జరిగాయి. ఈ కార్యక్రమానికి తెలుగు సంగీతాభిమానుల నుంచి విశేష స్పందన లభించింది.కార్యక్రమంలో స్వరసామ్రాట్ డాక్టర్ శరత్ చంద్ర స్వర విభావర్తి ద్వారా గాన దిగ్గజాలు ఘంటసాల, ఎస్‌పీ బాలసుబ్రహ్మణ్యంకు సంగీత నివాళులు అర్పించారు. ప్రముఖ మిమిక్రీ కళాకారుడు రమేష్ తన హాస్య చాతుర్యంతో పాటు గాన ప్రదర్శనతో ప్రేక్షకులను అలరించారు. యువ గాయకులను ప్రోత్సహిస్తున్న తల్లిదండ్రులను ప్రత్యేకంగా ప్రశంసించారు. పద్మ కొడెల రూపొందించిన వేదిక అలంకరణలు సభకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. అకాడమీ ఛైర్మన్ డాక్టర్ హరి ఇప్పనపల్లి మాట్లాడుతూ భావితరాల గాయకులకు శిక్షణ, మార్గదర్శకత్వం అందించేందుకు సంస్థ కృషి చేస్తోందని తెలిపారు. ఈ సందర్భంగా ఘంటసాల సంగీత పరిరక్షణకు చేసిన

కార్యక్రమంలో పాల్గొన్న ఎస్ పి బి మ్యూజిక్ అకాడమీ ఛైర్మన్ డాక్టర్ హరి ఇప్పనపల్లి, అధ్యక్షుడు శ్రీనివాస్ గూడూరు, ఉపాధ్యక్షురాలు రాజీ బుర్ర

విశిష్ట సేవలకు గుర్తింపుగా డాక్టర్ శరత్ చంద్రకు "గాన కళా తపస్వి" బిరుదును ప్రదానం చేశారు. మిమిక్రీ రమేష్‌ను కూడా ఘనంగా సన్మానించారు. నస్సాన్ కౌంటీ ఎగ్జిక్యూటివ్ కార్యాలయం తరఫున జింగ్ జావో, అకాడమీ సలహాదారు డాక్టర్ రవి అయ్యగారి, బోర్డు సభ్యురాలు సుజాత వెంపరాల తదితరులు పాల్గొన్నారు. మహేష్ దొమల,విజయేంద్ర బాస,రమా వనం,కుమార్ బుద్ధరాజు,సునీల్ గడం,వాణి సింగిరికొండ తదితరులు కార్యక్రమ నిర్వహణలో సహకరించారు. న్యూయార్క్ తెలుగు సంగీతాభిమానులు, కుటుంబ సభ్యుల భాగస్వామ్యంతో కార్యక్రమం విజయవంతంగా ముగిసింది.

పారిశుధ్య నిర్వహణను నిరంతరం పర్యవేక్షించాలి : జెడ్సి సత్యనారాయణ

చాంద్రాయణగుట్ట, జూన్ 10, ప్రభాతవార్త : పారిశుద్ధ్య నిర్వాహణను నిరంతరం పర్యవేక్షించాలని చార్మినార్ జోనల్ కమిషనర్ కన్నం సత్యనారాయణ అధికారులకు సూచించారు. నగరాన్ని నిత్యం పరిశుభ్రంగా ఉంచేందుకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలకు ప్రజల సహకారం ఎంతో అవసరమన్నారు. పూల్‌బాగ్‌లోని జోనల్ కార్యాలయంలో బుధవారం యాకుత్‌పురా, సంతోష్‌నగర్, చార్మినార్ డిప్యూటీ కమిషనర్లు, పారిశుద్ధ్య విభాగం అధికారులు, శానిటరీ సూపర్వైజర్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు, రాంకీ సంస్థ ప్రతినిధులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. చెత్త తరలింపు, స్వచ్ఛ ఆటోలు, ఇతర సమస్యలపై అడిగి తెలుసుకున్నారు. రోడ్లపై పేరుకు పోయిన చెత్తను ఉదయం, రాత్రి వేళలతో పాటు మధ్యాహ్నం సమయంలో సైతం తొలగించాలని జెడ్సి, రాంకీ సంస్థ ప్రతినిధులు నందకిషోర్, అరవింద్‌లను ఆదేశించారు. అన్ని స్థాయిల అధికారులు, సిబ్బంది స్థానిక సమస్యలపై ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. ప్రతిరోజు క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ పారిశుద్ధ్య ఇబ్బందులు తలెత్తకుండా

జోనల్ కార్యాలయంలో పారిశుధ్య నిర్వాహణపై అధికారులు, రాంకీ సంస్థ ప్రతినిధులతో సమీక్షిస్తున్న జెడ్సి సత్యనారాయణ

ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలన్నారు. నిత్యం పర్యటకులతో రద్దీగా ఉండే హెరిటేజ్ కట్టడాలు, మార్కెట్లు, నాలాల సమీప బస్తీలలో పారిశుధ్యంపై అవగాహన పెంచాలన్నారు. శానిటేషన్‌పై ఫిర్యాదులు వస్తే సంబంధిత అధికారులు, సిబ్బందిపై చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఈ సమీక్ష సమావేశంలో యాకుత్‌పురా, సంతోష్ సర్కిళ్ల డిప్యూటీ కమిషనర్లు సుభాష్‌రావు, భాస్కర్‌రెడ్డి, శానిటేషన్ డీఈ వెంకట్‌రాజు, సానిటరీ సూపవైజర్లు, సానిటరీ జవాన్లు, ఎస్ఎఫ్ఏలు ఉన్నారు.

అంతర్జాతీయ వడ్రంగి పోటీలకు యశ్వంత్ చారి ఎంపిక

సికింద్రాబాద్, జూన్ 10 ప్రభాతవార్త:

సాంప్రదాయ కులవృత్తులు కనుమరుగవుతున్న ప్రస్తుత కాలంలో, వృత్తిపై నైపుణ్యంతో ప్రపంచ స్థాయిలో గుర్తింపు సాధించవచ్చని నిరూపిస్తున్నాడు కేసోజు యశ్వంత్ చారి. చైనాలో జరగనున్న అంతర్జాతీయ వడ్రంగి వృత్తి పోటీలలో భారతదేశం తరపున పాల్గొనే అరుదైన అవకాశాన్ని ఆయన దక్కించుకున్నాడు. సికింద్రాబాద్ పార్శీగుట్ట బాపూజీనగర్ కు చెందిన కేసోజు బ్రహ్మాచారి, మాధవి దంపతుల కుమారుడైన యశ్వంత్, చిన్ననాటి నుంచే వడ్రంగి వృత్తిపై ఆసక్తి పెంచుకుని, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో తన ప్రతిభను అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా తీర్చిదిద్దుకున్నాడు. కేశవ్ మెమోరియల్ ఆప్ టెక్నాలజీ ఇనిస్టిట్యూట్ లో బీటెక్ చదువుతున్న యశ్వంత్ ఇటీవల కేంద్ర ప్రభుత్వ ఎంఎస్ఎంఈ (ఎంఎస్ఎంఈ) సంస్థ న్యూఢిల్లీలో నిర్వహించిన జాతీయ స్థాయి స్కిల్డ్ పోటీల్లో పాల్గొని, గోల్డ్ మెడల్ తో పాటు రూ లక్ష నగదు ప్రైజ్ ను పొందాడు. అలాగే త్వరలో చైనా లో జరిగే అంతర్జాతీయ కార్పెంట్ స్కిల్డ్ పోటీలకు ఎంపికయ్యాడు. అధికారుల సహకారంతో లభించిన ఈ అవకాశం భారతీయ వడ్రంగుల నైపుణ్యాన్ని ప్రపంచానికి చాటిచెప్పేందుకు ఒక గొప్ప వేదికగా నిలవనుంది. ఏ వృత్తీ చిన్నది కాదని, నైపుణ్యానికి ప్రపంచవ్యాప్తంగా గౌరవం ఉంటుందని యశ్వంత్ నిరూపించాడని విశ్వకర్మ 7 సంఘాల ప్రతినిధులు కొనియాడారు. పిల్లల ఆసక్తులను ప్రోత్సహిస్తే వారు ఏ రంగంలోనైనా ఉన్నత శిఖరాలను అధిరోహించగలరనే విషయానికి ఈ విజయం ఒక నిదర్శనం. చైనాలో జరిగే పోటీలలో యశ్వంత్ అత్యుత్తమ ప్రతిభ కనబరిచి, ప్రథమ బహుమతి సాధించి దేశానికి, తెలంగాణ రాష్ట్రానికి కీర్తి తీసుకురావాలని ఆకాంక్షిస్తూ విశ్వకర్మ ప్రముఖులు ఆయనకు శుభాకాంక్షలు తెలియజేశారు. "వృత్తి పట్ల గౌరవం, అంకితభావం ఉంటే ప్రపంచమే వేదిక అవుతుంది" అనే సందేశాన్ని యశ్వంత్ నేటి యువతకు అందిస్తున్నాడని వారు అన్నారు.

విద్యాహక్కు చట్టాన్ని అమలు చేయాలని ధర్నా

ధర్నాలో పాల్గొన్న ప్రతినిధులు

ధర్నాచౌక్, జూన్ 10 ప్రభాతవార్త: విద్య హక్కు చట్టం సాధనకై పేద విద్యార్థుల తల్లిదండ్రులు బహుజన ప్రజా శక్తి ఆధ్వర్యంలో పాదయాత్ర నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా నగరంలోని ఇందిరాపార్క వద్ద జరిగిన ధర్నాలో పాదయాత్ర చేసిన రాష్ట్ర బహుజన ప్రజా శక్తి కన్వీనర్ నల్ల లక్ష్మణ్, మహబూబ్‌నగర్ జిల్లా ఇన్‌చార్జి ఇటికాల రాణి మాట్లాడుతూ దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 79 ఏళ్ళు అవుతున్నప్పటికి అందరికి విద్య అందలేదని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే రాష్ట్ర వ్యాప్తంగా విద్య హక్కు చట్టాన్ని అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు. విద్య హక్కు చట్టం అమలులోకి వచ్చి 16 సంవత్సరాలు గడిచినప్పటికి అమలు చేయకపోవడం దారుణమన్నారు. తక్షణమే 6 నుంచి 16 సంవత్సరాల లోపు విద్యార్థులందరికి ఉచిత నిర్బంధ విద్యను అమలు చేయాలని, ఇందుకోసం వచ్చే అసెంబ్లీ సమావేశాల్లో విద్య హక్కు చట్టం అమలు పర్చాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా పాఠశాలలు, కళాశాలల సంఖ్యను పెంచాలని, ప్రైవేటు విద్యా సంస్థల్లో ఫీజులు దోపిడిని అరికట్టాలని, ఇందుకోసం ప్రత్యేకంగా చట్టాన్ని తీసుకురావాలని, రాష్ట్ర బడ్జెట్‌లో విద్యకు 25 శాతం నిధులు కేటాయించాలని వారు కోరారు. విద్య పట్ల నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని వారు హెచ్చరించారు. ఈ ధర్నాలో నాయకులు మంతటి గోపి, సరస్వతి, శివాని, నల్లవల్ల రుక్మిణి తదితరులు పాల్గొన్నారు.

అమ్మ వారి ఆలయంలో బిజెపి నేతల పూజలు

బేగంపేట జూన్ 10,ప్రభాతవార్త ప్రధాని నరేంద్రమోదీ నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో చల్లంగా ఉండాలంటూ అమ్మ వారి ఆలయంలో పూజలు నిర్వహించారు. ప్రధానిగా నరేంద్రమోదీ 12సంవత్సరాల పాటు సుదీర్ఘ పాలనను,దేశ సేవను పూర్తి చేసుకుంటున్న సందర్భంగా బేగంపేట డివిజన్ జనరల్ సెక్రటరీ ఎమ్.బాబూరావు ఆధ్వర్యంలో బ్రాహ్మణవాడీలోని శ్రీమహాలక్ష్మి, నల్లపోచమ్మ మందిరంలో ప్రత్యేక అర్చన నిర్వహించారు.పూజలు చేసారు.భారత దేశాన్ని మరింత అభివృద్ధి పథంలో ముందుకు నడిపించే శక్తి సామర్థ్యాలను ఆ భగవంతుడు ఆయనకు ప్రసాదించాలని ఈ పూజలు నిర్వహించామన్నారు.కార్యక్రమంలో మహంకాళీ సికింద్రాబాద్ జిల్లా బీజేపీ ప్రధాన కార్యదర్శి నెమలి ఆనంద్ (నందూ),జిల్లా ఓబీసీ మోర్చా ప్రధాన కార్యదర్శి సి.విజయ్‌కుమార్, ఆనంద్, రాజేష్,సురేష్,శ్రవణ్,కిషోర్,మహేష్ పాల్గొన్నారు.

ఆంజనేయ స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు

వివేక్ నగర్‌లోని ఆంజనేయ స్వామి దేవాలయంలో పూజలు నిర్వహిస్తున్న బిజెపి నాయకులు

చిక్కడపల్లి జూన్ 10 (ప్రభాతవార్త) : దేశ ప్రధానిగా నరేంద్ర మోదీ 12 ఏళ్ల సుదీర్ఘ పాలనను దిగ్విజయంగా పూర్తి చేసుకున్న సందర్భంగా, బుధవారం చిక్కడపల్లి వివేక్ నగర్ లోని ఆంజనేయ స్వామి దేవాలయంలో బిజెపి నాయకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బిజెపి సికింద్రాబాద్ పార్లమెంట్ జాయింట్ కన్వీనర్ ఎ.వినయ్ కుమార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మోదీ గారి నాయకత్వం దేశాన్ని ప్రపంచ స్థాయిలో అగ్రపథంలో నిలబెట్టిందని, వికసిత భారత్ నిర్మాణానికి ఆయన నిరంతరం స్ఫూర్తినిస్తున్నారని కొనియాడారు. దేశాభివృద్ధి కోసం నిరంతరం శ్రమిస్తున్న ప్రధానికి దీర్ఘాయుష్షు, ఆరోగ్యం కలగాలని కోరుకుంటూ, మునుముందు కూడా దేశానికి ఆయన సేవలు అవసరమని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బిజెపి సీనియర్ నాయకులు శ్రీకాంత్, దామోదర్, వి.ఎస్.టి రాజు, శివకుమార్, డివిజన్ ప్రధాన కార్యదర్శి ఆనంద్ రావు, రవీందర్, శ్రీనివాస్ మరియు ఇతర పార్టీ నేతలు పాల్గొన్నారు.

మొహర్రం సందర్భంగా అన్ని ఏర్పాట్లు చేయాలి

డిజిపి సి.వి.ఆనంద్‌ను కలిసి వినతి పత్రం అందజేస్తున్న బిజెపి రాష్ట్ర మైనార్టీ మోర్చ మాజీ అధికార ప్రతినిధి మీర్ ఫిరాసత్ అలీ బాక్రీ

చార్మినార్,జూన్ 10 ప్రభాతవార్త :

పవిత్ర మొహర్రం మాసం సందర్భంగా ఎటువంటి ఇబ్బందులు కలగకుండ ఉండేలా భారీ భద్రత ఏర్పాట్లను చేయాలని కోరుతూ పాతబస్తీకి చెందిన బిజెపి రాష్ట్ర మైనార్టీ మోర్చ మాజీ అధికార ప్రతినిధి మీర్ ఫిరాసత్ అలీ బాక్రీ రాష్ట్ర డిజిపి సి.వి.ఆనంద్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు.ఈ నెల 16వ తేదీ నుంచి ఆగష్టు నెల 23వ తేదీ వరకు 68 రోజుల పాటు కార్యక్రమాలు జరుగుతాయని,రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న అషూర్‌ఖానాల వద్ద భద్రతా ఏర్పాట్లు చేయాలని డిజిపి సి.వి.ఆనంద్‌ను కోరామని మీర్ ఫిరాసత్ అలీ బాక్రీ తెలిపారు.మొహర్రం సందర్భంగా అన్ని ఏర్పాట్లు చేస్తామని డిజిపి సి.వి.ఆనంద్ హామి ఇచ్చారని ఆయన తెలియజేశారు.డిజిపిని కలిసిన వారిలో మీర్ ఫిరాసత్ అలీ బాక్రీతో పాటు పలువురు ఉన్నారు.

3 ఏళ్ళుగా బ్యాంక్‌లలో పెండింగ్‌లో ఉన్న రుణాలను విడుదల చేయాలి

సైఫాబాద్, జూన్ 10 ప్రభాతవార్త: రాష్ట్రంలో యువతకు, పారిశ్రామిక వేత్తలకు కేంద్రం కల్పించిన రుణాలు గత మూడేళ్ళుగా పెండింగ్‌లో ఉన్నాయని ఆ రుణాలను బ్యాంక్‌లు వెంటనే విడుదల చేయాలని వెనుకబడిన తరగతుల జాతీయ కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు బుధవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కమిటీ వ్యవస్థాపక అధ్యక్షురాలు ఎం.భాగ్యలక్ష్మి ఓబిసిలను పారిశ్రామిక వేత్తలుగా తయారు చేసేందుకు 'అఖిల భారత ఓబిసి పారిశ్రామిక వేత్తల తెలంగాణ కమిటీ'ని ప్రారంభించి మాట్లాడారు. ప్రధాన మంత్రి నరేంద్రమోదీ చేపట్టిన 'మేక్ ఇన్ ఇండియా' ద్వారా స్వదేశీ రంగాన్ని ప్రోత్సహిస్తున్నారని, తెలంగాణలో ఆ అవకాశాలు నిజమైన లబ్ధిదారులకు చేరాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం ఓబిసి ఇండస్ట్రియల్ పాలసీ అమలుకు ప్రత్యేకంగా కమిటీని వేయాలని, ప్రతి నియోజకవర్గంలో పారిశ్రామిక శిక్షణా కేంద్రాలను ఏర్పాటు చేసి భూములు కేటాయించాలని, ప్రోత్సాహకాలు అందించాలని విజ్ఞప్తి చేశారు. తమ సెంట్రల్ కమిటీ జులై 27వ తేదీ నుంచి రాష్ట్రంలోని అన్ని నియోజవర్గాలను పర్యటించి, అవగాహన కార్యక్రమాలు చేపడతామన్నారు. కేంద్ర ప్రభుత్వం అనేక స్వయం ఉపాధి పథకాలను అమలు చేస్తున్నప్పటికి వాటి ప్రయోజనాలు ఓబిసి

సమావేశంలో మాట్లాడుతున్న ఎం.భాగ్యలక్ష్మి

యువతకు పూర్తి స్థాయిలో అందడం లేదని ఆమె ఆరోపించారు. ప్రతి నియోజకవర్గంలో వంద మంది పారి శ్రామిక వేత్తలను తయారు చేయాలనే లక్ష్యంతో ఓబిసి జాతీయ కమిటి ఉందని, ఈ అవకాశాన్ని యువత, మహిళలు వినియోగించుకోవాలని ఆమె సూచించారు. సిఎం రేవంత్‌రెడ్డి ఒక కోటి మంది మహిళలను కోటిశ్వరులుగా చేస్తామని ప్రకటించారని, ఆ లక్ష్యాన్ని తాము స్వాగతిస్తున్నామని, ఇందులో బిసి మహిళలకు సముచిత ప్రాధాన్యత కల్పించాలని, ప్రతి నియోజ కవర్గంలో వేలాది మంది మహిళలకు స్వయం ఉపాధి, పరిశ్రమలు, రుణాలు, సబ్సిడీలు అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. బిసి, ఎస్సీ, ఎస్టీ, మైనార్టిల ఆర్థిక అభి వృద్ధి లేకుండా తెలంగాణ అభివృద్ధి అసంపూర్తిగానే ఉంటుందన్నారు.

మట్టిలోని మాణిక్యాలు..ఘనమైన ఫలితాలు..

-ప్రభుత్వ కళాశాలలకు దిక్సూచిగా కె.ఎం.పాండు మెమోరియల్ గవర్నమెంట్ వోకేషనల్ జూనియర్ కాలేజ్

పేట్ బషీరాబాద్, జూన్ 10, ప్రభాతవార్త

తాము పేదరికంలో జీవిస్తున్నా తమ పిల్లలు మాత్రం ఉన్నత చదువులు చదవాలని ఆలోచించే తల్లిదండ్రులు అప్పు చేసి మరి ఫీజులను చెల్లిస్తూ చదివిస్తుంటే, మరికొందరు తల్లిదండ్రులు మాత్రం తమకు ఉన్నత దాంట్లో పిల్లలను చదివించి ప్రయోజకులను చేయాలనుకుంటారు మరి కొంతమంది. ఇలాంటి వారికే వరప్రదాయనిగా మారింది "కెఎం. పాండు మెమోరియల్ గవర్నమెంట్ ఒకేషనల్ జూనియర్ కళాశాల కుత్బుల్లాపూర్". మొట్టమొదటిసారిగా ప్రైవేట్ కళాశాలలకు దీటుగా ప్రభుత్వ కళాశాలల విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధిస్తూ ఔరా అనిపిస్తున్నారు. పేద విద్యార్థులకు ఉన్నత విద్యను అందించాలనే ఆ ప్రజా నాయకుడి తపన, ప్రైవేట్ కళాశాల దీటుగా ఆ ప్రభుత్వ కళాశాలలో అందుతున్న సౌకర్యాలు, ఉపాధ్యాయుల బోధనా విధానం వెరిసి నేడు ఇంతటి విజయాన్ని చేకూర్చి పెట్టాయి.

మట్టిలో మాణిక్యాలు... ఘనమైన ఫలితాలు....

విద్యాభ్యాసంలో తమ పేదరికం ఎప్పటికీ అడ్డు కాదు అంటూ ఈ కళాశాల విద్యార్థులు 2026వ సంవత్సరంలో సాధించిన ఫలితాలే నిదర్శనం. ఈ క్రమంలో మల్టీపర్పస్ హెల్త్ వర్కర్ కోర్సులో జీ. భాగ్యశ్రీ (981) మార్కులు సాధించగా, ఎం.ఎల్.టీ కోర్సులో కే. పూజిత (970) మార్కులు సాధించగా, కంపెనీ సెక్రటరీ కోర్సులో ఏ. అక్షయ (966), టీ.రోషిని (966) మార్కులు సాధించగా, ఎలక్ట్రికల్ టెక్నీషియన్ కోర్సులో ఎం. లిఖిత (943), పి. శ్రీహరి (936) సాధించగా, ఎంపీసీ 2లో 1000 మార్కులకు గాను పి. జోష్ణ (981), వి.వర్షిత (951), వడ్ల వర్షిత (940) సాధించగా, బైపిసి1లో 470 మార్కులకు గాను వాలియా జబీన్ (428) సాధించగా, సిఇసి 2లో 1000 మార్కులకు గాను బి. సంజన (839) మార్పులను సాధించగా, హెచ్ఈసి2లో 1000 మార్కులకు గాను కె. మాలతి(882) మార్కులు సాధించారు.

ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు ఎమ్మెల్యే సత్కారం...

ఉత్తమ ఫలితాలతో ప్రభుత్వ కళాశాలల విద్యార్థులకు స్ఫూర్తి దాయకంగా నిలిచిన విద్యార్థులను బుధవారం బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్ కుత్బుల్లాపూర్‌లోని ఎమ్మెల్యే నివాస కార్యాలయం వద్ద శాలువాలతో సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వివేకానంద్ మాట్లాడుతూ విద్యాభ్యాసం ద్వారానే మనలోని అజ్ఞానాన్ని రూపుమాపవచ్చని నమ్మే మా నాన్న "కె. ఎం.పాండు" సంకల్పానికి నిదర్శనంగా ప్రతి నిరుపేద విద్యార్థులకు ఉపాధి కల్పనతో కూడిన ఉన్నత విద్యను అందించాలనే ధ్యేయంతో ఏర్పాటు చేసిన ఈ వోకేషనల్ జూనియర్ కళాశాలలో విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించడం చాలా సంతోషంగా ఉందని అన్నారు.ఈ కార్యక్రమంలో కేఎం.పాండు గవర్నమెంట్ వోకేషనల్ జూనియర్ కళాశ

వరద నీరు సాఫీగా పోయేలా చర్యలు చేపట్టాలి : ఎమ్మెల్యే తలసాని

మోండాలోని సజన్ లాల్ స్ట్రీట్‌లో నిలిచిపోయిన వరదనీరు

కంటోన్మెంట్,జూన్ 10 ప్రభాతవార్త: ఈ నెల 9వ తేదీన కురిషిన బారీ వర్షానికి మోండా డివిజన్‌లోని సజన్ లాల్‌స్ట్రీట్ పరిసర ప్రాంతాల్లో వరదనీటి ప్రవాహంతో ప్రజలు,వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. విషయం తెలుసుకున్న మాజీ మంత్రి, సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ ఆదేశలతో జిహెచ్ఎంసి అధికారులు సహాయక చర్యలను వేగవంతం చేశారు. బోయిన్‌పల్లి సర్కిల్ డిప్యూటీ కమిషనర్ డాకూ నాయక్, శానిటేషన్ అధికారులు అక్కడికి చేరుకొని వరదనీరు సాఫీగా పోయే విధంగా చర్యలు చేపట్టారు. రోడ్లపై ఉన్న మట్టి, మ్యాన్ హోల్స్‌కు అడ్డంగా ఉన్న చెత్త, వ్యవర్థాలను తొలగించారు.

రోడ్డు భద్రతా సూత్రాలను పాటించాలి : డిసిపి శ్రీధర్

బోయిన్‌పల్లిలో అరైవ్ అలైవ్ కార్యక్రమం నిర్వహిస్తున్న మల్కాజిగిరి డిసిపి శ్రీధర్ తదితరులు

కంటోన్మెంట్,జూన్ 10 ప్రభాతవార్త: రోడ్డు ప్రమాదాల నివారణకు వాహన చోదకులు ప్రత్యేక చొరవ తీసుకోవాలని వాహన చోదకులు రోడ్డు భద్రతా సూత్రాలను తప్పని సరిగా పాటించాలని మల్కాజిగిరి డిసిపి శ్రీధర్ తెలిపారు. బుధవారం బోయిన్‌పల్లి చౌరస్తాలో నిర్వహించిన ట్రాఫిక్ అరైవ్,అలైవ్ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. మద్యం సేవించి వాహనాలు నడపకూడదని సెల్‌ఫోన్ డ్రైవింగ్ చేయకూడదని,ద్విచక్రవాహన దారులు తప్పని సరిగాహెల్మెట్ ధరించాలని,ట్రాఫిక్ సిగ్నల్స్‌ను తప్పనిసరిగా పాటించాలన్నారు. రోడ్డు నిబంధనలు పాటించకపోతే ప్రమాదాలు జరుతాయన్నారు. ఈ కార్యక్రమంలో బేగంపేట ఏసీపీ గోపాలక్రిష్ణమూర్తి, బోయిన్‌పల్లి ఇన్‌స్పెక్టర్ తిరుపతి రాజు, బోయిన్‌పల్లి ట్రాఫిక్, లా అండ్ ఆర్డర్ ఎస్ఐలు,పోలీసులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బాధితులకు ఎమ్మెల్యే అక్బరుద్దీన్ ఒవైసి ఆర్థిక సహాయం

చాంద్రాయణగుట్ట, జూన్ 10, ప్రభాతవార్త : విద్యుదాఘాతంతో మృతి చెందిన బాధిత కుటుంబాలను చాంద్రాయణగుట్ట శాసనసభ్యులు అక్బరుద్దీన్ ఓవైసీ మంగళవారం రాత్రి పరామర్శించారు. వారి కుటుంబ నేపథ్యాన్ని తెలుసుకొని చలించి పోయారు. కుటుంబ సభ్యులకు ధైర్య వచనాలు పలికారు. తన సొంత నిధులతో మృతుల కుటుంబాలకు ఆర్థిక సహాయం అందించనున్నట్లు ప్రకటించారు. టీజీఎస్‌పీడీసీఎల్ సీఎండితో చర్చించారు. బాధితులకు తగిన నష్టపరిహారం అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అఫ్రోజ్, జాఫర్ మృతదేహాలకు ఉస్మానియా శవాగారంలో త్వరగా పోస్టుమార్టం జరిగేలా అక్కడి ఆర్ఎంతో చర్చించాలని బండ్లగూడ ఇన్‌స్పెక్టర్ ఆర్.దేవేందర్, బండ్లగూడ మండల డిప్యూటీ తహశీల్దార్ నాగరాజులను, మొత్తం ప్రక్రియను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని మాజీ కార్పొరేటర్ సమద్ బిన్ అబ్బాత్‌లను ఆదేశించారు. మంగళవారం సాయంత్రం ఈదురు గాలుతో కూడిన భారీ వర్షానాకి పాతబస్తీ బండ్లగూడ రాయలసీ హోటల్ సమీపంలో విద్యుత్ తీగలు తెగిపడి జహంగీరాబాద్‌కు చెందిన విద్యార్థి మహ్మద్ జాఫర్ (16), ఆటోడ్రైవర్ మహ్మద్ అఫ్రోజ్ (22)లు మృత్యువాత పడ్డ విషయం తెలిసిందే.

ఎస్ఐఆర్ సర్వేలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి : ఎమ్మెల్యే శ్రీగణేష్

కంటోన్మెంట్,జూన్ 10 ప్రభాతవార్త: ఎస్.ఐ.ఆర్ సర్వేపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కంటోన్మెంట్ ఎమ్మెల్యే ఎన్.శ్రీగణేష్ తెలిపారు.బుధవారం క్లాసిక్ గార్డెన్‌లో కంటోన్మెంట్ నియోజకవర్గం కాంగ్రెస్ బూత్ లెవల్ శిక్షణ తరగతుల కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో రాజ్య సభ సభ్యుడు అనీల్ కుమార్ యాదవ్, సికింద్రాబాద్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు దీపక్ జాన్, వైశ్య కార్పోరేషన్ చైర్మన్ కల్వ సుజాతలతో పాటు సీనియర్ కాంగ్రెస్ నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

చార్మినార్, రాజేంద్రనగర్ జోన్లలో ఎస్సైల బదిలీ

చాంద్రాయణగుట్ట, జూన్ 10, ప్రభాతవార్త : చార్మినార్, రాజేంద్ర నగర్ జోన్ పరిధిలోని వివిధ పోలీస్‌స్టేషన్లలో పనిచేస్తున్న సబ్ ఇన్‌స్పెక్టర్లను బదిలీ చేస్తూ నగర పోలీసు కమిషనర్ వి.సి.సజ్జనార్ మంగళవారం ఆదేశాలు జారీ చేశారు. ఛత్రినాక ఎస్ఐలు రాయుడు త్రిమూర్తులను గోషామహల్‌కు, సింగారం స్వప్నను భరోసా కేంద్రానికి, శాలిబండ ఎస్ఐ షమా నూర్‌ను రాజేంద్రనగర్‌కు, చాంద్రాయణగుట్ట ఎస్సైలు పలివేల శ్రీనివాసరావును టాస్క్‌ఫోర్స్‌కు, వి.జయమ్మను గోల్కొండ జోన్ మహిళా పోలీసుస్టేషన్‌కు బదిలీ చేశారు. వారి స్థానంలో పంజాగుట్ట ట్రాఫిక్ ఎస్సై మలావత్ మోజీరామ్‌ను బండ్లగూడకు, సైఫాబాద్ ట్రాఫిక్ ఎస్సై సయ్యద్ అబ్దుల్ ఖరీమ్‌ను చాంద్రాయణగుట్టకు, రాజేంద్రనగర్ జోన్ మహిళా పోలీసుస్టేషన్ ఎస్సై చల్ల జ్యోతిని బండ్లగూడకు, జూబ్లీహిల్స్ మహిళా పోలీసుస్టేషన్ ఎస్సై నందికొండ సరళను చాంద్రాయణగుట్టకు, సీఏఆర్‌లో ఉన్న ఎస్సై గొల్ల రాఘవేంద్రను ఛత్రినాకకు, తొట్టెంపు సుధాకర్‌ను ఛత్రినాకకు, కె.మహబూబ్ బాషను ఫలక్‌నుమాకు, పగిడిముక్కుల నాగరాజ్‌ను ఫలక్‌నుమాకు, మాతంగి అనిల్‌ను శాలిబండకు, నీరీక్షణలో ఉన్న మహ్మద్ మాజిద్ అలీని ఛత్రినాకకు బదిలీ చేశారు.

శంకర్ గౌడ్ కుటుంబసభ్యులను పరామర్శించిన బండారు దత్తాత్రేయ

యూసుఫ్‌గూడ, 10 జూన్, ప్రభాతవార్త : జనసేన పార్టీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు శంకర్ గౌడ్ తల్లి నేమూరి భారతమ్మ ఇటీవల మరణించడంతో హిమాచల్ ప్రదేశ్ మాజీ గౌవర్నర్ బండారు దత్తాత్రేయ శంకర్ గౌడ్ నివాసానికి వెళ్లి భారతమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అదేవిధంగా కుటుంబసభ్యులను పరామర్శించారు.

ప్రభుత్వ పాఠశాలలకు పాఠ్యపుస్తకాల పంపిణీ

చాంద్రాయణగుట్ట, జూన్ 10, ప్రభాతవార్త : వెసవి సెలవుల తరువాత ఈనెల 15వ తేదీ సోమవారం నుండి ప్రభుత్వ, ఎయిడెడ్, గుర్తింపు పొందిన పాఠశాలలు పునఃప్రారంభం కానున్నాయి. 2026-27 విద్యా సంవత్సరం తొలి రోజు నుండే విద్యార్థుల చేతుల్లో పాఠ్య, రాత పుస్తకాలు ఉండాలన్న లక్ష్యంతో విద్యాశాఖ అధికారులు కృషి చేస్తున్నారు. ఇందులో భాగంగా పాఠ్యపుస్తకాల పంపిణీని ఆయా జోన్ల డిప్యూటీ ఈఓలు, డిప్యూటీ ఐఓఎస్‌లు ప్రారంభించారు. పుస్తక పంపిణీ కేంద్రాలను పరిశీలించి అక్కడి ఉద్యోగులకు దిశా నిర్దేశం చేస్తున్నారు. బహదూర్‌పురా-1 డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ స్కూల్స్(డిప్యూటీ ఐఓఎస్) పెద్దిరెడ్డి వెంకట్‌రెడ్డి తన పరిధిలోని 15 ఉన్నత, 30 ప్రాథమిక పాఠశాలలో చదువు కుంటున్న సుమారు మూడు వేల మంది విద్యార్థులకు అవసరమైన పాఠ్య, నోటు పుస్తకాల పంపిణీని ప్రారంభించారు. త్వరలో యూనిఫారమ్, షూలు, తొమ్మిది వస్తువులతో కూడిన కిట్లను పంపిణీ చేస్తామన్నారు. తొలిరోజు దారుల్‌షిఫా ప్రభుత్వ అంధుల ఉన్నత పాఠశాల ఇంచార్జ్ సద్గుణ, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు మందడి వెంకట్‌రెడ్డిలు పాఠ్య, నోటు పుస్తకాలను స్వీకరించారు. ఈనెల 15న విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు అందించనున్నట్లు వారు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రవికాంత్, రమ, సమగ్ర శిక్ష సిబ్బంది కౌసల్య, దీపిక, జమీల్ తదితరులు పాల్గొన్నారు.

పాఠ్య, నోటు పుస్తకాల పంపిణీని ప్రారంభిస్తున్న డిప్యూటీ ఐఓఎస్ వెంకట్‌రెడ్డి

ఆయా, వాలంటీర్లకై దరఖాస్తుల స్వీకరణ

బహదూర్‌పురా-1 పరిధిలో తొమ్మిది పూర్వ ప్రాథమిక పాఠశాలలు మంజూరైనట్లు డిప్యూటీ ఐఓఎస్ వెంకట్‌రెడ్డి వెల్లడించారు. మీరాలం మండి, బజార్ ఏ ఘాన్సీ, రికాబ్‌గంజ్, మీరాలం ట్యాంక్, రామ్నాస్‌పురా, కుమ్మరివాడి, బజార్ ఏ నూర్ ఉమ్రా, ఇరానీ గల్లి, ఖాజా నగర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో (పిఎస్) ఆంగ్ల మాధ్యమంలో ఎల్‌కెజి, యుకెజి తరగతులను ఈనెల 15వ తేదీ నుండి ప్రారంభించనున్నారు. ఇందుకు అవసరమైన ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఆయా పాఠశాలల నిర్వాహణకు అవసరమైన వాలంటీర్లు, ఆయాల నియామకం కోసం ఇప్పటికే దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు తెలిపారు. ఔత్సాహికులైన వారు దారుల్‌షిఫాలోని డిప్యూటీ ఐఓఎస్ కార్యాలయంలో ఉదయం 10.30 గంటల నుండి సాయంత్రం 5 గంటల మధ్య స్వయంగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తుకు అదేరోజు చివరి రోజని పేర్కొన్నారు.

అక్టోబర్ 8 నుంచి 'ఆర్చరీ ప్రీమియర్ లీగ్'

పీపుల్స్ ప్లాజా వేదికగా 11 రోజుల పాటు పోటీలు

పోటీ పడనున్న ప్రపంచ ఉత్తమ ఆర్చర్లు

హైదరాబాద్, జూన్ 10,ప్రభాతవార్త: హైదరాబాద్ నగర క్రీడా మైదానంలో మరో ప్రతిష్ఠాత్మక లీగ్‌కు తెరలేవనుంది. దేశంలోనే మొట్టమొదటి ఫ్రాంచైజీ ఆధారిత ఆర్చరీ టోర్నమెంట్ "ర్చరీ ప్రీమియర్ లీగ్ (ఏపీఎల్) రెండో సీజన్‌కు భాగ్యనగరం ఆతిథ్యమివ్వడానికి సర్వం సిద్ధమైంది. అక్టోబర్ 8 నుంచి 18 వరకు ఐనెక్స్ నెక్లెస్ రోడ్డులోని పీపుల్స్ ప్లాజా వేదికగా 11 రోజుల పాటు ఈ క్రీడా సంబరం జరగనుంది. ఆర్చరీ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (ఏఏఐ) ఆధ్వర్యంలో, తెలంగాణ ప్రభుత్వ ప్రత్యేక సహకారంతో జరగబోయే ఈ మెగా ఈవెంట్‌లో ప్రపంచస్థాయి విలువిద్యగాళ్లు తమ గురిని పరీక్షించుకోనున్నారు.ఈ లీగ్‌లో మొత్తం 6 ఫ్రాంచైజీ జట్లు (మైటీ మరాఠాస్, రాజ్‌పుతానా రాయల్స్, పృథ్వీరాజ్ యోధాస్, కాకతీయ నైట్స్, చేరో ఆర్చర్స్, చోళ చీఫ్స్) తలపడనున్నాయి. భారత్‌కు చెందిన స్టార్ ఆర్చర్లు దీపికా కుమారి, అతాను దాస్, ఓజాస్ డియోతాలే, జ్యోతి సురేఖ, అభిషేక్ వర్మలతో పాటు పలువురు ఒలింపిక్, ప్రపంచ ఛాంపియన్లు ఈ టోర్నీలో భాగం కానున్నారు. పురుషులు, మహిళలతో పాటు రికర్వ్, కాంపౌండ్ విభాగాల ఆర్చర్లు కలిసి ఆడేలా ఈ పోటీలను వినూత్నంగా డిజైన్ చేశారు. ముఖ్యంగా ఒలింపిక్స్ కంటే భిన్నంగా ఇందులో ప్రవేశపెట్టిన 15 సెకన్ల షాట్ క్లాక్ (షూటింగ్ సమయం) ఆటలో వేగాన్ని, ఉత్కంఠను మరింత పెంచనుంది. దేశంలో ఆర్చరీ క్రీడా వ్యవస్థను బలోపేతం చేయడమే లక్ష్యంగా గతేడాది న్యూఢిల్లీలో ప్రారంభమైన ఈ లీగ్, ఇప్పుడు హైదరాబాద్ వేదికగా మరింత గ్రాండ్‌గా సాగనుందని లీగ్ డైరెక్టర్ అనిల్ కామినేని తెలిపారు. డబుల్ రౌండ్‌రాబిన్ ఫార్మాట్‌లో సాగే ఈ టోర్నీలో టాప్4 స్థానాల్లో నిలిచిన జట్లు సెమీఫైనల్స్‌కు అర్హత సాధిస్తాయి. డిఫెండింగ్ ఛాంపియన్‌గా రాజ్‌పుతానా రాయల్స్ బరిలోకి దిగుతుండగా, టోర్నీకి సంబంధించిన షెడ్యూల్, ఆటగాళ్ల వేలం, ప్రత్యక్ష ప్రసార వివరాలను త్వరలోనే అధికారికంగా ప్రకటించనున్నారు.ఆర్చరీ అసోసియేషన్ ఆఫ్ ఇండియా సెక్రటరీ జనరల్, ఏపీఎల్ డైరెక్టర్ వీరేంద్ర సచ్‌దేవా మాట్లాడుతూ.. ఒలింపిక్స్‌లో ఇండియా ఆర్చేరి విజయాల మార్గాన్ని మరింత బలోపేతం చేయాలనే ఒక పెద్ద విజన్‌తో ఏపీఎల్‌కు శ్రీకారం చుట్టామని తెలిపారు. ప్రపంచంలోని అతిపెద్ద వేదికలపై మన అథ్లెట్లు పతకాల కోసం నిలకడగా పోటీ పడాలంటే, వారికి అత్యున్నత స్థాయి పోటీల అనుభవం క్రమంతప్పకుండా అవసరమని, లీగ్ ద్వారా అదే అందించడానికి ప్రయత్నిస్తున్నామని పేర్కొన్నారు.

సనత్‌నగర్‌లో తాగునీటి సమస్యపై ఆందోళన

వినతిపత్రం ఇస్తున్న దృశ్యం

సంజీవరెడ్డి నగర్, జూన్ 10, ప్రభాతవార్త: సనత్‌నగర్ డివిజన్ పరిధిలోని పలు కాలనీల్లో తాగునీటి సరఫరా సక్రమంగా జరగడం లేదని బీఆర్ఎస్ నాయకుడు కొలను బాల్‌రెడ్డి ఆరోపించారు. ఈ మేరకు కాలనీవాసులతో కలిసి బుధవారం జలమండలి అధికారులను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా కొలను బాల్‌రెడ్డి మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో పదేళ్ల కాలంలో ఎప్పుడూ నీటి కొరత సమస్య తలెత్తలేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే 24 గంటల నీటి సరఫరా అందిస్తామని హామీ ఇచ్చి, ప్రస్తుతం ఆ హామీని అమలు చేయడంలో విఫలమైందని విమర్శించారు. నీటి సరఫరాలో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని అధికారులను కోరారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు కరుణాకర్ రెడ్డి, ఖలీల్, ఆకుల రాజు, ఆర్. రవి, మల్లేష్ యాదవ్, శ్రీను, ప్రకాష్ గౌడ్, శ్రీనివాస్ రెడ్డి, సాయిరామ్ గౌడ్, అనంత్ రెడ్డి, కుమార్, సురేందర్ గౌడ్, లింగం యాదవ్ పాల్గొన్నారు.

లంబాడీ సామాజికవర్గం అధికారులపై ఎసిబి దాడులు

సమావేశంలో మాట్లాడుతున్న మోతిలాల్‌నాయక్

సైఫాబాద్, జూన్ 10 ప్రభాతవార్త: లంబాడీ సామాజిక వర్గానికి చెందిన ఉన్నతాధికారులపై ఎసిబి దాడులు జరుగుతున్నాయని సేవాలాల్ బంజారా సంఘం ఆరోపించింది. ఈ దాడులను తీవ్రంగా ఖండిస్తున్నామని సేవాలాల్ బంజారా సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు కొర్ర మోతిలాల్‌నాయక్ చెప్పారు. ఈ మేరకు బుధవారం ఎన్ఎస్ఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తరువాత లంబాడీ సామాజిక వర్గానికి చెందిన అనేక మంది ఉన్నతాధికారులు, ఉద్యోగులపై ఎసిబి దాడులు ఎక్కువగా జరుగుతున్నాయని ఆరోపించారు. ఎసిబి దాడులు, విచారణల పేరుతో సాగుతున్న పరిణామాలకు లంబాడీ సమాజం భయభ్రాంతులకు గురవుతున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. అనేక శాఖలలో అగ్రకుల అధికారులు, ఉద్యోగులపైన ఎందుకు ఎసిబి అధికారులు దాడులు చేయడం లేదని ప్రశ్నించారు. తాజాగా ఆర్ అండ్ బిలో ఎన్‌సి మోహన్‌నాయక్‌పై జరిగిన ఎసిబి చర్యల నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న తీరుపై అనేక ప్రశ్నలు తలెత్తుతున్నాయని చెప్పారు. ఈ సమావేశంలో గిరిజన సంక్షేమ సంఘం అధ్యక్షుడు పతినాయక్, సేవాలాల్ బంజారా సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి గణేష్‌నాయక్, మహిళా నాయకురాలు స్వప్న రాథోడ్ పాల్గొన్నారు.

విద్యార్థుల ఉజ్వల భవిష్యత్ కోసం కృషి చేయాలి

: ఎమ్మెల్యే మాదవరం కృష్ణారావు

చిన్నారులకు నోట్ పుస్తకాలను అందజేస్తున్న ఎమ్మెల్యే మాదవరం కృష్ణారావు.

యూసుఫ్‌గూడ, 10 జూన్, ప్రభాతవార్త : విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించి వారి ఉజ్వల భవిష్యత్ కోసం కృషి చేయాల్సిన అవసరం ఎంతైన ఉన్నదని ఎమ్మెల్యే మాదవరం కృష్ణారావు అన్నారు. బుధవారం అల్లాపూర్ డివిజన్ పరిధిలోని వివేకానంద్ నగర్ కాలనీలో మౌటెన్ కిడ్స్ పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో స్థానిక మాజీ కార్పొరేటర్ సబీహా గౌసుద్దీన్‌తో కలసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు నోట్ పుస్తకాలను అందజేశారు. తొందర్లో పాఠశాల తరగతులు ప్రారంభకానున్న దిశగా విద్యార్థులకు ఉపాధ్యాయులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గం మైనారటి సెల్ అధ్యక్షులు డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షులు లింగాల అయలయ్య, ప్రధాన కార్యదర్శి పిల్లి తిరుపతి, వీరారెడ్డి, నాగుల సత్యం, వివేకానంద్‌నగర్ కాలనీ అధ్యక్షులు బొల్లు శ్రీనివాసరావు, ఆవుల సంజీవ, శ్రీనివాస రెడ్డి, రోణంకి జగన్నాథం, గాయిత్రినగర్ అధ్యక్షులు కృష్ణారావు, పాఠశాల ప్రిన్సిపల్ బి.సుగంద పరిమల, డైరెక్టర్ నీరజ్‌నాయుడు, వైస్ ప్రిన్సిపల్ స్వర్ణలతతో పాటు ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

రాహుల్ మృతిపై తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాలు విచారణ చేపట్టాలి

సైఫాబాద్, జూన్ 10 ప్రభాతవార్త: తెలంగాణ రాష్ట్రానికి చెందిన ఇంజనీరింగ్ విద్యార్థి అంకం రాహుల్ మృతి ఘటనపై తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాలు తక్షణమే విచారణ జరిపి బాధ్యులపై కఠినంగా చర్యలు తీసుకోవాలని బిసి రాజ్యాధికార సమితి డిమాండ్ చేసింది. బుధవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు దాసు సురేష్ మాట్లాడుతూ గత నెల 27వ తేదీ నుంచి అదృశ్యమైన రాహుల్ జూన్ 7వ తేదీ వరకు కనిపించకపోవడానికి గల కారణాలను అధికారులు తెలియజేయాలని డిమాండ్ చేశారు. రాహుల్ హైదరాబాద్ నగరంలో మిస్సింగ్ అయ్యి, ఎపిలోని సింగ రాయకొండ సమీపంలోని ఒక బావిలో మృతదేహం గుర్తుపట్టలేని స్థితికి చేరుకునే వరకు ప్రభుత్వాలు పట్టించుకొకపోవడం దారుణమన్నారు. రాహుల్‌ది హత్యా, లేక ఆత్మహత్య అనే విషయాన్ని ప్రభుత్వాలు తెలియజేయాలన్నారు. ఘటనకు రెండు ప్రభుత్వాలతోపాటు జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. అలాగె తెలంగాణ గురించి మాట్లాడే ఎపి డిసిఎం పవన్‌కళ్యాణ్ కూడా ఈ అంశంపై స్పందించి రాహుల్ కుటుంబానికి న్యాయం జరిగేలా చూడాలని కోరారు. బాధిత రాహుల్ కుటుంబానికి కళాశాల యాజమాన్యం, ఒక కోటి, రెండు ప్రభుత్వాలు మరొక కోటి రూపాయలు నష్టపరిహారం చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సమితి నాయకులు సరస్వతి, నాగజ్యోతి, దేవదాస్, వెంకటస్వామి, శారదాదేవి, సునీత, రేణుక పాల్గొన్నారు.

5 కి.మీ పరిధి వారికే 2బిహెచ్‌కే ఇళ్ల కేటాయింపు

దుండిగల్, జూన్ 10, ప్రభాతవార్త

డబుల్ బెడ్‌రూం కాలనీల్లో కేటాయించిన ఇళ్లలో లబ్ధిదారులు తప్పనిసరిగా నివాసం ఉండేలా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర హౌసింగ్ శాఖ ప్రత్యేక కార్యదర్శి, హౌసింగ్ కార్పొరేషన్ ఎండీ వి.పి. గౌతం అధికారులను ఆదేశించారు. ఇళ్లు కేటాయించుకున్నప్పటికీ కాలనీల్లో నివసించని వారికి మరోసారి నోటీసులు జారీ చేయాలని, స్పందించకపోతే కేటాయింపులు రద్దు చేసి ఇతర అర్హులకు ఇళ్లు అందజేస్తామని స్పష్టం చేశారు.బుధవారం జిల్లా కలెక్టర్ మను చౌదరితో కలిసి బౌరంపేట, గండిమైసమ్మ, దుండిగల్ ప్రాంతాల్లోని 2బిహెచ్‌కే కాలనీలను సందర్శించిన ఆయన నిర్మాణ పనులు, మౌలిక వసతుల పురోగతిని పరిశీలించారు. దుండిగల్ ఫేజ్1 కాలనీలో లబ్ధిదారులతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. ప్రభుత్వం పేదల జీవన ప్రమాణాలు మెరుగుపర్చేందుకు, వారికి సొంత ఇంటి కల నెరవేర్చేందుకు ఈ పథకాన్ని అమలు చేస్తోందని తెలిపారు. దుండిగల్ ఫేజ్2లో కొనసాగుతున్న నిర్మాణ పనులను పరిశీలించిన గౌతం, మిగిలిన పనులను త్వరితగతిన పూర్తి చేయాలని కాంట్రాక్టర్లను ఆదేశించారు. తాగునీరు, విద్యుత్, రహదారులు తదితర మౌలిక వసతుల పనులపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు.ఇకపై 2బిహెచ్‌కే ఇళ్లను ఆయా కాలనీలకు సమీపంలోని 5 కిలోమీటర్ల పరిధిలో నివసించే అర్హులకే కేటాయించాలని ప్రభుత్వం నిర్ణయించిందని ఆయన తెలిపారు. ఈ మేరకు గండిమైసమ్మ ప్రాంతంలో లబ్ధిదారుల గుర్తింపు కోసం నిర్వహిస్తున్న సర్వేను పరిశీలించారు. ప్రజాపాలనలో

దరఖాస్తు చేసుకున్న, సొంత ఇల్లు లేదా ఇంటి స్థలం లేని ఎల్ 2 జాబితాలోని అర్హులను గుర్తించేందుకు సర్వే కొనసాగుతోందన్నారు.సర్వే వివరాలను యాప్‌లో సక్రమంగా నమోదు చేసి, ప్రక్రియను త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరం యుద్ధప్రాతిపదికన లబ్ధిదారుల ఎంపిక పూర్తి చేసి ఇళ్ల కేటాయింపులు చేపట్టాలని జిల్లా యంత్రాంగానికి సూచించారు.ఈ పర్యటనలో హౌసింగ్ కార్పొరేషన్ చీఫ్ ఇంజనీర్ ఎం. చైతన్యకుమార్, సూపరింటెండింగ్ ఇంజనీర్ విజయకుమార్, హౌసింగ్ బోర్డు చీఫ్ ఇంజనీర్ జి.వి. రమణారెడ్డి, జిల్లా హౌసింగ్ పీడీ రమణమూర్తి తదితర అధికారులు పాల్గొన్నారు.

ప్రైవేటు స్కూళ్లల్లో జర్నలిస్టుల పిల్లలకు ఫీజు రాయితీ కల్పించండి

-డీఈవో యాదయ్యకు హెచ్ యూజే వినతి

హైదరాబాద్, జూన్ 10,ప్రభాతవార్త: హైదరాబాద్‌లో పని చేస్తున్న జర్నలిస్ట్ ల పిల్లలకు ప్రయివేటు, కార్పొరేట్ పాఠశాలల్లో ఫీజు రాయితీ కల్పించాలని హైదరాబాద్ యూనియన్ ఆఫ్ జర్నలిస్ట్స్ (హెచ్ యూజే టీడబ్ల్యూజేఎఫ్) ప్రభుత్వాన్ని కోరింది. ఈ మేరకు హైదరాబాద్ డీఈవో యాదయ్యను బుధవారం హెచ్ యూజే కార్యదర్శి బి జగదీశ్వర్, ఉపాధ్యక్షులు ఎస్ మాధవరెడ్డి, జాతీయ కౌన్సిల్ సభ్యులు చిట్యాల మధుకర్ కలిసి వినతి పత్రం అందజేశారు. ప్రయివేటు, కార్పొరేట్ పాఠశాలల్లో అధిక ఫీజులతో తల్లిదండ్రులతో జర్నలిస్ట్ లు కూడా సతమతం అవుతున్నారని తెలిపారు. పిల్లల ఫీజులు కట్టలేక ఇబ్బంది పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జర్నలిస్ట్‌ల్లో ఎక్కువ మందికి సరైన వేతనాల్లేవని పేర్కొన్నారు. ప్రభుత్వానికి, ప్రజలకు వారధిగా మీడియా, పాత్రికేయులు పనిచేస్తున్నారని తెలిపారు. ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్ళేది కూడా జర్నలిస్ట్ లేనని పేర్కొన్నారు. జర్నలిస్ట్ ల ఆర్థిక పరిస్థితిని అర్థం చేసుకుని ప్రస్తుత విద్యా సంవత్సరంలో ప్రయివేటు, కార్పొరేట్ పాఠశాలల్లో 50 శాతానికి తగ్గకుండ జర్నలిస్ట్ ల పిల్లలకు ఫీజులో రాయితీ కల్పించాలని విజ్ఞప్తి చేశారు.

వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి

చార్మినార్,జూన్ 10 ప్రభాతవార్త : వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తెలంగాణ స్వర్ణకార యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు వింజమూరి రాఘవ చారి అన్నారు.చార్మినార్ సమీపంలోని చార్‌కమాన్‌లో బుధవారం చార్‌కమాన్ స్వర్ణకార యూనియన్ ఆధ్వ ర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు.కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన రాష్ట్ర స్వర్ణకార యూనియన్ అధ్యక్షులు వింజమూరి రాఘవ చారి మాట్లాడుతూ ప్రజలు ఆరోగ్యం పట్ల తగు జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు.బి.పి,మధుమేహం,ఇసిజి పరీక్షల తో పాటు చెవి.కళ్లు,దంత వైద్య పరీక్షలు నిర్వహించారు.అపోలో ఆసుపత్రి తరుపున ఉచి తంగా మందులు పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో చార్‌కమాన్ స్వర్ణకార యూనియన్ అధ్యక్షులు కె.ఆంజనేయులు చారి,గౌరవ అధ్యక్షులు చొల్లేటి విష్ణు వర్ధన్ చారి,ప్రధాన కార్యదర్శి ఎం.వేణు గోపాల చారి,కోశాధికారి కె.శ్రీధర్,యూనియన్ ప్రతినిధులు మద్దూరి సుధాకర్ చారి,సంజయ్ చారి,పి.శ్రీనివాస్ చారిశశికాంత్,జి.నవీన్ కుమార్,అపోలో ఆసుపత్రి వైద్యులు,సిబ్బంది ,యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

వైద్యసంఘాల ప్రమేయం లేకుండా బదిలీలు

**గోషామహల్,జూన్

త్రినేత్ర ఆంజనేయ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు

వనస్థలిపురం జూన్10,ప్రభాతవార్త :
రాష్ట్ర పార్టీ ఆదేశాల మేరకు ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ప్రభుత్వ 12 సంవత్సరాల విజయోత్సవ కార్యక్రమాలలో భాగంగా బుధవారం శ్రీ త్రినేత్ర ఆంజనేయ స్వామి ఆలయంలో బిజెపి సీనియర్ నాయకులు శ్రీ గంగం ప్రేమనాథ్ ఆధ్వర్యంలో ఆంజనేయ స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు మరియు హనుమాన్ చాలీసా పారాయణ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో రంగారెడ్డి అర్బన్ జిల్లా సోషల్ మీడియా కన్వీనర్ శ్రీనివాస్ పీసపాటి , సోషల్ మీడియా కన్వీనర్ కొండం మహేందర్ రెడ్డి , భారతీయ జనతా పార్టీ సీనియర్ నాయకులు సీనియర్ నాయకులు పండ్యాల శివశంకర్ గౌడ్ , మయ్యర్ నాగేష్ , మ్యగని నరసింహ , రాచకొండ నివాస్ , బొమ్మరాజు వెంకటేష్ , మురళి , విజయ్ కుమార్ , గుణగంటి మహేష్ గౌడ్ , పోతరాజు సిద్దేశ్వర్ , తీరిల్లీ నాయకులు బంటు చందు, సాయి శివరాం తదితరులు పాల్గొన్నారు.

ఎల్లమ్మ తల్లి ఆలయంలో మహిళల ఆధ్వర్యంలో మహాహారతి

వనస్థలిపురం జూన్10, ప్రభాతవార్త
వనస్థలిపురం ఎల్లమ్మ తల్లి దేవాలయంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో కేంద్ర ప్రభుత్వం 12 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా నిర్వహిస్తున్న విజయోత్సవ కార్యక్రమాలలో భాగంగా ఎల్బీనగర్ మహిళా మోర్చా ఆధ్వర్యంలో మహా హారతి కార్యక్రమం భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించబడింది.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మల్కాజిగిరి పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్ హాజరయ్యారు.ఈ సందర్భంగా ఈటల రాజేందర్ మాట్లాడుతూ, "ప్రధాన మంత్రి నరేంద్ర మోదీనాయకత్వంలో భారతదేశం ప్రపంచ వేదికపై తన ప్రతిష్టను మరింత పెంచుకుందన్నారు. పేదలు, మహిళ లు, యువత మరియు రైతుల సంక్షేమాన్ని లక్ష్యంగా చేసుకుని మోదీ ప్రభుత్వం అభివృద్ధి, సేవా భావం మరియు సుపరిపాలనకు నిదర్శనంగా నిలిచిందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో మేడ్చల్ జిల్లా రూరల్ ఇంచార్జ్ సామ రంగారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శులు బోల్గాం యశ్వాల్ గౌడ్,బండారి భాస్కర్, మాజీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ కొప్పుల నరసింహారెడ్డి, అసెంబ్లీ కన్వీనర్ కొత్త రవీందర్ గౌడ్ , రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు బండారు శైలజ , రాష్ట్ర ప్రత్యేక ఆహ్వాన కమిటీ సభ్యులు చెన్నకేశవ రెడ్డి , రాష్ట్ర లేబర్ సెల్ కన్వీనర్ అందే శ్రీనివాస్, జిల్లా అధ్యక్షురాలు నందికొండ గీతారెడ్డి, జిల్లా కార్యదర్శులు నరేష్ యాదవ్ , నూతి శ్రీనివాస్ రావు , జిల్లా కార్యాలయ కార్యదర్శి ఎడ్ల అమరేష్ ముదిరాజ్, సీనియర్ నాయకులు కేసిరెడ్డి పద్మారెడ్డి, కొప్పర శ్యామల, జిల్లా సోషల్ మీడియా ఇంచార్జ్ అమూల్య రెడ్డి , జిల్లా కమిటీ సభ్యులు, డివిజన్ అధ్యక్షులు విష్ణువర్ధన్ రావు కాటం క్రాంతి గౌడ్ , రవీందర్ రెడ్డి , జయప్రకాష్ , యువ మోర్చా నాయకులు, మహిళా మోర్చా నాయకులు, వివిధ మోర్చాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

20లోపు గ్యాస్ వినియోగదారులు ఈకేవైసీ చేయించుకోవాలి : గిరిధర్

మాలిక్ పేట, జూన్ 10, ప్రభాతవార్త:
గ్యాస్ వినియోగదారులు ఈనెల 25 తేదీ లోపు ఈ కేవైసీ చేయించుకోవాలని మలక్ పేట స్టెర్లింగ్ గ్యాస్ నిర్వహకులు కె.గిరిధర్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గ్యాస్ వినియోగదారులు ఈకేవైసీ చేయించకపోతే వినియోగదారులకు గ్యాస్ డెలివరీని నిలిపి వేయడం జరుగుతుందని పేర్కొన్నారు. ప్రధానమంత్రి ఉజ్వల యోజన పథకం వినియోగదారులు ఈకేవైసి పూర్తి చేయించుకోవాలని సూచించారు. అదేవిధంగా ఆరు నెలలుగా గ్యాస్ రీఫిల్ చేయని వినియోగదారులకు కూడా గ్యాస్ కనెక్షన్ రద్దు అవుతుందని వివరించారు. గ్యాస్ వినియోగదారులకు మెరుగైన సేవలు అందించడానికి సకాలంలో ఈ కేవైసీ చేయించుకోవాలని గిరిధర్ కోరారు.

బిఆర్ఎస్ సభ్యత్వ నమోదును విజయవంతం చేయాలి : సామ సుందర్‌రెడ్డి

డివిజన్ అధ్యక్షులకు సూచనలు చేస్తున్న యాకుత్‌పుర బిఆర్ఎస్ ఇంఛార్జి సామ సుందర్‌రెడ్డి

సైదాబాద్, జూన్ 10 ప్రభాతవార్త: బిఆర్ఎస్ సభ్యత్వ నమోదును విజయవంతం చేయాలని యాకుత్‌పుర బిఆర్ఎస్ ఇంఛార్జి సామ సుందర్‌రెడ్డి అన్నారు. యాకుత్‌పుర నియోజకవర్గంలో చేపడుతున్న బిఆర్ఎస్ సభ్యత్వ నమోదు గురించి యాకుత్‌పుర బిఆర్ఎస్ ఇంఛార్జి సామ సుందర్‌రెడ్డి, సభ్యత్వ నమోదు ఇంఛార్జి అర్షద్ అలీఖాన్‌లు డివిజన్ అధ్యక్షులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నియోజకవర్గంలో సభ్యత్వ నమోదులో ప్రతి నాయకుడు, కార్యకర్త పాల్గొనాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ సామ స్వప్న సుందర్‌రెడ్డి, డివిజన్ అధ్యక్షులు మెట్టు భాస్కర్‌రెడ్డి, ప్రవీణ్ రాజ్, సాయిబాబ, నర్సింగ్‌రావు, శ్రీనివాస్, ఎజాజ్, సాబేర్ తదితరులు పాల్గొన్నారు.

సిఎం రిలీఫ్ ఫండ్ పేదలకు వరం : ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి

సిఎం రిలీఫ్ ఫండ్ ఎల్ఓసి పత్రాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి

సైదాబాద్, జూన్ 10 ప్రభాతవార్త:
సిఎం రిలీఫ్ ఫండ్ పేదలకు అండగా నిలుస్తుందని ఎల్‌బినగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. లింగోజిగూడ డివిజన్ గ్రీన్ పార్క్ కాలనీకి చెందిన మీణు మెదడుకు సంబంధించిన అనారోగ్య సమస్యలతో బాధపడుతూ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డిని కలిసి తమ ఆర్థిక పరిస్థితిని వివరించి చికిత్స కోసం సిఎం రిలీఫ్ ఫండ్‌ను ఇప్పించాల్సిందిగా కోరారు. దీంతో వెంటనే స్పందించిన ఎమ్మెల్యే వారి చేత సిఎం రిలీఫ్ ఫండ్‌కు దరఖాస్తు చేయించారు. ఈ నేపథ్యంలో సిఎం రిలీఫ్ ఫండ్ నుంచి మంజూరైన రూ.4లక్షల ఎల్ఓసికి సంబంధించిన పత్రాన్ని బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో మహేష్‌రెడ్డి, అనిల్ యాదవ్, అంజయ్య గౌడ్, మధుసూధన్, మనీష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు పాటించి ప్రమాదలను నివారించాలి : సిపి సుమతి

ప్రతిజ్ఞ చేయిస్తున్న కమిషనర్ సుమతి

పోలీస్ స్టేషన్‌లో వివరాలు తెలుసుకుంటున్న కమిషనర్

హయత్ నగర్, జూన్ 10 ప్రభాతవార్త :
ప్రాణాలతో గమ్యానికి చేరుకోండి – మీ కుటుంబం మీ కోసం ఎదురు చూస్తోందని మల్కాజ్‌గిరి పోలీస్ కమిషనర్ సుమతి అన్నారు. అరైవ్ అలైవ్ నినాదంతో రోడ్డు భద్రతపై హయత్‌నగర్‌లో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ని సందర్భంగా ఆమె హయత్ నగర్ పోలీస్ స్టేషన్‌ను పరిశీలించి కేసుల వివరాలు తెలుసుకున్నారు. అనంతరం అంబేద్కర్ విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. రోడ్డు భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. ట్రాఫిక్ నిబంధన లను తప్పనిసరిగా పాటించాలని , ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలని, నాలుగు చక్రాల వాహనదారులు సీట్ బెల్ట్ వినియోగించాలని సూచించారు. నిరక్ష్యపు డ్రైవింగ్, అతివేగం ప్రమాదకరమని, మద్యం సేవించి వాహనాలను నడపరాదన్నారు. ప్రతి రోడ్డు ప్రమాదం వెనుక ఒక కుటుంబ భాద ఉంటుందని తెలిపారు. రోడ్డు భద్రతపై ప్రజలకు కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎల్బీ నగర్ డీసీపీ అనురాధ, డిప్యూటీ డీఎంహెచ్ఓ డా.లక్ష్మీ ప్రసన్న, రోడ్ సేఫ్టీ ఆఫీసర్ మనోహర్, అదనపు డీసీపీ కోటేశ్వరరావు, వనస్థలిపురం ఏసీపీ కాశిరెడ్డి , హయత్ నగర్ సీఐ నాగరాజు, హయత్‌నగర్ డీఎం విజయ్, మాజీ కార్పొరేటర్లు కళ్లెం నవజీవన్ రెడ్డి, కొప్పుల నర్సింహారెడ్డి , కాలనీ సంక్షేమ సంఘాల ప్రతినిధులు, రోడ్డు ప్రమాద బాధిత కుటుంబ సభ్యులు తదితరులు హాజరయ్యారు.

చెత్త తొలగింపు - వ్యాధుల నివారణకు అధికారుల తక్షణ చర్యలు

(వార్త స్పందన)

తుర్కయంజాల్, జూన్ 10 ప్రభాతవార్త
ఆదిభట్ల సర్కిల్ పరిధి తుర్కయంజాల్ డివిజన్‌లో లక్ష్మీ నగర్, ఇంద్రమ్మనగర్ కాలనీల ప్రజలు ఎదుర్కొంటున్న పారిశుద్ధ్య సమస్యపై అధికారులు బుధవారం వేగంగా స్పందించి చర్యలు చేపట్టారు. ప్రజా సమస్యల పట్ల ప్రభుత్వ యంత్రాంగం ఎంత బాధ్యతాయుతంగా వ్యవహరించగలదో ఈ ఘటన మరోసారి నిరూపించారు.కాలనీల మధ్య ఉన్న రహదారి పక్కన పెద్ద మొత్తంలో చెత్త పేరుకుపోవడంతో దోమలు, ఈగలు, వీధి కుక్కలు, పందుల సంచారం పెరిగింది. దీంతో స్థానికులు అంటువ్యాధుల బారిన పడే ప్రమాదం నెలకొంది. ఈ సమస్యను వార్త దినపత్రిక వెలుగులోకి తీసుకురావడంతో అధికారులు వెంటనే స్పందించారు.వార్త ప్రచురితమైన వెంటనే పారిశుద్ధ్య విభాగం సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని చెత్తను పూర్తిగా తొలగించారు. పరిసర ప్రాంతాల్లో బ్లీచింగ్ పౌడర్ చల్లి శానిటేషన్ చర్యలు చేపట్టారు. దీంతో కాలనీవాసులు తీవ్ర ఇబ్బందుల నుంచి ఉపశమనం పొందారు. సమస్య పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకున్న పారిశుద్ధ్య అధికారులను స్థానిక ప్రజలు అభినందించారు. అలాగే ప్రజల సమస్యలను వెలుగులోకి తీసుకువచ్చిన ప్రభాత వార్త యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలియజేశారు. ఇలాంటి సమస్యలు భవిష్యత్తులో పునరావృతం కాకుండా ఉండేందుకు కొన్ని శాశ్వత చర్యలు అవసరమని స్థానికులు సూచిస్తున్నారు. క్రమం తప్పకుండా చెత్త సేకరణ జరిగేలా ప్రత్యేక వ్యవస్థ ఏర్పాటు చేయడం, కాలనీల్లో తగిన సంఖ్యలో డస్ట్‌బిన్లను ఏర్పాటు చేయడం, ప్రజల్లో పారిశుద్ధంపై అవగాహన పెంపొందించడం అవసరమని అభిప్రాయపడ్డారు.వర్షాకాలం సమీపిస్తున్న నేపథ్యంలో డ్రైనేజీలను తరచూ శుభ్రం చేయడం, దోమల నివారణకు యాంటీ లార్వా మందులు పిచికారీ చేయడం, బ్లీచింగ్ పౌడర్ చల్లడం వంటి చర్యలను నిరంతరం చేపట్టాలని కోరారు.ప్రజల ఆరోగ్య భద్రతను దృష్టిలో ఉంచుకుని వెంటనే రంగంలోకి దిగి సమస్యను పరిష్కరించిన ఆదిభట్ల సర్కిల్, తుర్కయంజాల్ డివిజన్ పారిశుద్ధ్య అధికారుల పనితీరు ఇతర ప్రాంతాలకు కూడా ఆదర్శంగా నిలవాలని కాలనీవాసులు అభిప్రాయపడ్డారు.

మంచినీటి సమస్యను పరిష్కరించాలి : చింతల



డిజిఎంకు వినతిపత్రం అందజేస్తున్న బిఆర్ఎస్ నాయకులు.

వనస్థలిపురం. జూన్.10.ప్రభాతవార్త.
వనస్థలిపురం డివిజన్‌లో మంచినీటి సమస్య పరిష్కారానికి జలమండలి అధికారులకు వినతిఉమ్మడి వనస్థలిపురం డివిజన్ మరియు చింతల కుంట డివిజన్ పరిధిలో నెలకొన్న తీవ్రమైన మంచినీటి సమస్యను తక్షణమే పరిష్కరించాలని కోరుతూ బి.ఆర్.ఎస్ వనస్థలిపురం డివిజన్ అధ్యక్షులు చింతల రవి కుమార్ ఆధ్వర్యంలో జలమండలి డిప్యూటీ జనరల్ మేనేజర్ (డీజీఎం) నాగరాజుకి వినతి పత్రం సమర్పించారు..ఈ సందర్భంగా చింతల రవి కుమార్ మాట్లాడుతూ, వనస్థలిపురం డివిజన్ పరిధిలోని పలు కాలనీలలో తాగునీటి సరఫరా సక్రమంగా జరగకపోవడం, తక్కువ ఒత్తిడితో నీరు రావడం, సరఫరా సమయాలు పాటించకపోవడం వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ముఖ్యంగా మహిళలు, వృద్ధులు, చిన్నారులు నిత్యావసరమైన తాగునీటి కోసం గంటల తరబడి వేచి చూడాల్సిన పరిస్థితి నెలకొన్నదని ఆవేదన వ్యక్తం చేశారు.అదేవిధంగా ప్రజల అవసరాల కోసం సరఫరా చేయాల్సిన నీటి ట్యాంకర్లను కొందరు వ్యక్తులు అక్రమంగా విక్రయిస్తున్నారనే ఫిర్యాదులు ప్రజల నుండి వస్తున్నాయని, ప్రజల దాహాన్ని ఆసరాగా చేసుకుని నీటిని వ్యాపారంగా మార్చడం అత్యంత దురదృష్టకరమైన మరియు ఖండనీయమైన విషయమని పేర్కొన్నారు.కావున వనస్థలిపురం డివిజన్ పరిధిలోని అన్ని కాలనీలలో తక్షణమే పరిస్థితిని సమీక్షించి, అవసరమైన ప్రాంతాలకు అదనపు నీటి ట్యాంకర్లను ఏర్పాటు చేయడంతో పాటు తగిన ఒత్తిడితో నిరంతరాయంగా మంచినీటి సరఫరా జరిగేలా చర్యలు తీసుకోవాలని జలమండలి అధికారులను కోరారు. అలాగే ట్యాంకర్ల ద్వారా నీటిని అక్రమంగా విక్రయిస్తున్న వారిపై సమగ్ర విచారణ జరిపి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో కొలిశెట్టి సంజయ్ కుమార్, వర్కింగ్ అధ్యక్షులు లగోని శ్రీధర్ గౌడ్, ప్రశాంతనగర్ కాలనీ అధ్యక్షులు దూసరి మధు గౌడ్, ఫేస్ 2హుడాకాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు కరుణాకర్ రెడ్డి , శ్రీనివాసపురం కాలనీ అధ్యక్షులు.ఆనంద్ రాజ్, ప్రశాంత్ నగర్ ప్రధాన కార్యదర్శి బాబురావు, గడాల రాజు, పి.వి. నరసింహరావు, మిట్ట రామ్మోహన్ , శ్రీనివాసరావు, అశోక్, రవికాంత్, ప్రకాష్, విజయ్ కుమార్ తదితర నాయకులు,పాల్గొన్నారు.

కాలనీ వాసుల ఆందోళన..దిగొచ్చిన ఇంటర్మీడియట్ బోర్డు అధికారులు

కాకతీయనగర్‌లో అనుమతి లేని కళాశాల ముందు ధర్నా నిర్వహిస్తున్న కాంగ్రెస్ నేత కంది శ్రవణ్ కుమార్ రెడ్డి తదితరులు

ఉప్పల్, జూన్ 10 ప్రభాతవార్త : హబ్సిగూడలోని కాకతీయ నగర్ కాలనీ వాసుల పోరాటంతో ఇంటర్మీడియట్ బోర్డు దిగొచ్చింది. గత రెండు రోజులుగా కాకతీయ నగర్ కాలనీలోని అనుమతి లేకుండా కళాశాల నిర్వహిస్తున్నారని ఆరోపిస్తూ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత కంది శ్రవణ్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో ఆందోళన నిర్వహిస్తున్నారు. దీంతో బుధవారం ఉదయం శ్రీ చైతన్య కాలేజీని ఇంటర్మీడియట్ బోర్డు అధికారులు కళాశాలను సీజ్ చేశారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు కంది శ్రవణ్ రెడ్డి మాట్లాడుతూహబ్సీగూడ డివిజన్ కాకతీయ నగర్ కాలనీ.. లో శ్రీ చైతన్య కాలేజీని ఏర్పాటు చేయడాన్ని ఆ కాలనీ వాసులు గత నాలుగు రోజులుగా నిరసన వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. తక్షణమే కాలేజీని మూసివేసిలా అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ కాలేజీ ఎదుట నిరసన చేపట్టారు. ఉప్పల్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ మందముల పరమేశ్వర్ రెడ్డి ఆదేశాలు మేరకు కాలనీ వాసులకి సంఘీభావం తెలిపిన హబ్సీగూడ కాంగ్రెస్ సీనియర్ నాయకులు యువజన కాంగ్రెస్ మాజీ జిల్లా అధ్యక్షులు కంది శ్రవణ్ కుమార్ రెడ్డి తెలిపారు. అధికారులు వెంటనే స్పందించి కాలేజీని సీజ్ చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం ఇంటర్మీడియట్ బోర్డు అధికారులతో మాట్లాడి సమస్య వివరించారు. ఈ నేపథ్యంలో ఇవాళ ఉదయం ఇంటర్మీడియట్ బోర్డు అధికారులు వచ్చి కాలనీ వాసులతో మాట్లాడారు. ఎటువంటి అనుమతులు లేకుండా ఏర్పాటు చేసిన శ్రీ చైతన్య కాలేజీ ని సీజ్ చేశారు. యాజమాన్యానికి నోటీసులు అందజేశారు. దీంతో కాలనీ వాసులు ఇంటర్మీడియట్ బోర్డు అధికారులకు, విద్యా శాఖ అధికారులకు కృతజ్ఞతలు తెలియజేశారు. కాగా, నిరసన సమయంలో కాలేజీ ఎదుట కాస్త ఉద్రిక్తత నెలకొంది. కాలనీ వాసులు, కాలేజీ యాజమాన్యం పరస్పరం ఆరోపణలు చేసుకున్నారు.అక్రమ కేసులు పెట్టేందుకు ప్రయత్నించిందని ఆరోపించారు.ఈ పరిమాణాన్ని కాంగ్రెస్ సీనియర్ నాయకులు కంది శ్రవణ్ రెడ్డి తీవ్రంగా ఖండించారు. ఈ నిరసన కార్యక్రమంలో హబ్సీగూడ డివిజన్ ప్రెసిడెంట్ గన్నారం విజయ్ కుమార్, జనరల్ సెక్రటరీ ధర్మా నాయక్, రామాలయం చైర్మన్ చింతల బాబురావు, ధర్మ కర్తలు రమాకాంత్ రెడ్డి, విపిన్ అగర్వాల్, నాయకులు గుండు రాజన్న, వాసు నాయక్, కాకతీయ నగర్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు, కాలనీ వాసులు పాల్గొన్నారు.

నార్మ్ డైరెక్టర్‌గా డాక్టర్ రామన్ మీనాక్షి సుందరం బాధ్యతలు

అత్తాపూర్ జూన్ 10,ప్రభాతవార్త :
భారత వ్యవసాయ పరిశోధన రంగంలో విశిష్ట సేవలు అందించిన శాస్త్రవేత్త డా. రామన్ మీనాక్షి సుందరం ఐకార్–నేషనల్ అకాడమీ ఆఫ్ అగ్రికల్చరల్ రీసెర్చ్ మేనేజ్‌మెంట్ (నార్మ్) డైరెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించారు. దాదాపు మూడు దశాబ్దాలపాటు భారత వ్యవసాయ పరిశోధన మండలి (ఐసిఎఆర్) వ్యవస్థలో విశిష్ట సేవలందించిన డా. సుందరం, శాస్త్రీయ పరిశోధనలు, సాంకేతిక ఆవిష్కరణలు, సంస్థాగత అభివృద్ధి మరియు జాతీయ స్థాయి పరిశోధన సమన్వయంలో తనదైన ముద్ర వేశారు. అంతకుముందు ఆయన ఐసిఎఆర్– ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రైస్ రీసెర్చ్ (ఐఐఆర్ఆర్), హైదరాబాద్ డైరెక్టర్‌గా సేవలందిస్తూ వరి పరిశోధన, జన్యు అభివృద్ధి, సాంకేతిక విస్తరణ కార్యక్రమాలకు నూతన దిశానిర్దేశం చేశారు.తమిళనాడు వ్యవసాయ విశ్వవిద్యాలయం నుండి బి.ఎస్‌సి (అగ్రికల్చర్), పంత్‌నగర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం నుండి మాలిక్యులర్ బయాలజీ బయోటెక్నాలజీలో ఎంఎస్‌సి, హైదరాబాద్ విశ్వవిద్యాలయం నుండి ప్లాంట్ సైన్సెస్‌లో పీహెచ్‌డీ పూర్తి చేసిన డా.సుందరం, పంటల జీవసాంకేతికత, మాలిక్యులర్ బ్రీడింగ్,జన్యు శాస్త్రం ,జీనోమిక్స్ ఆధారిత పంటాభివృద్ధి రంగాల్లో విశేష కృషి చేశారు.

15 వరకు చేయూత నమోదు : డిప్యూటీ కమిషనర్

ఉప్పల్, జూన్ 10 ప్రభాతవార్త :
ఉప్పల్ సర్కిల్ పరిధిలోచేయూత పెన్షన్ లబ్ధిదారులు (పెన్షన్ తీసుకుంటున్న వారు) అందరు తప్పనిసరిగా ఉప్పల్ సర్కిల్ కార్యాలయంలో గానీ లేదా, మీ సంబంధిత వార్డు ఆఫీస్ యందు గానీ సంప్రదించి ముఖ చిత్ర గుర్తింపు పూర్తి చేసుకోవాలని డిప్యూటీ కమిషనర్ శైలజ కోరారు. ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. సర్కిల్ పరిధిలో పెన్షన్ కొనసాగింపు కొరకు ఈనెల 15 వరకు ఈ ప్రక్రియ తప్పనిసరిగా పూర్తి చేసుకోవాలని సూచించారు. లేని పక్షంలో పెన్షన్ సేవలకు అంతరాయం కలుగు తుందని చెప్పారు. . కాబట్టి చేయూత పెన్షన్ లబ్ధిదారులు త్వరితగతిన ముఖ చిత్ర గుర్తింపు పూర్తి చేసుకోవాలని కోరారు.

హనుమాన్ దేవాలయంలో బిజెపి నాయకుల పూజలు

పూజలు నిర్వహిస్తున్న బిజెపి నాయకులు

సైదాబాద్, జూన్ 10 ప్రభాతవార్త: ప్రధాని నరేంద్రమోడి 12 సంవత్సరాల విజయవంతమైన అభివృద్ధి ప్రస్థానాన్ని పురస్కరించుకుని డిసిపి కార్యాలయం సమీపంలోని హనుమాన్ మందిరంలో బిజెపి నాయకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగ్యనగర్ జిల్లా అధ్యక్షుడు నిరంజన్ యాదవ్, రాష్ట్ర నాయకులు కొత్తకాపు రవీందర్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్ కొత్తకాపు అరుణ రవీందర్‌రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సంరెడ్డి సురేందర్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్ సహదేవ్ యాదవ్, జిల్లా ఉపాధ్యక్షులు శ్రీకాంత్‌రెడ్డి, నాయకులు దినేష్, సుధీర్, మహేష్, రాజేష్, ప్రవీణ్ పాల్గొన్నారు.

నాలా పనులు త్వరగా పూర్తి చేయాలి : మధుకర్‌రెడ్డి

నాలాను పరిశీలిస్తున్న జంగం మధుకర్‌రెడ్డి

సైదాబాద్, జూన్ 10 ప్రభాతవార్త: ఐఎస్ సదన్ డివిజన్ బాలాజినగర్‌లో కొనసాగుతున్న నాలా పనులను బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జంగం మధుకర్‌రెడ్డి బుధవారంన అధికారులు, కాలనీవాసులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాలా పనులు త్వరితగతిన పూర్తి చేసి స్థానికులకు ఇబ్బందులు తలెత్తకుండా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో కైలాష్ యాదవ్, మల్లేష్, పాండు, శంకర్, దశరథ్, పరమేష్, రమాదేవి, సుష్మ, నరేందర్, స్వప్నన తదితరులు పాల్గొన్నారు.

నృత్య ప్రదర్శనతో అలరించిన కళాకారులు

కార్యక్రమంలో పాల్గొన్న ముఖ్య అతిథులు

ఎల్.బి.నగర్, జూన్ 10 ప్రభాతవార్త:
కళాకారులు తమ నృత్య ప్రదర్శనతో ఆహుతులను అలరింపజేశారు. ఎంజె డాన్స్ స్టూడియో మోహన్‌నగర్ వారి ఆధ్వర్యంలో వేసవి శిక్షణ కార్యక్రమం ముగింపు వేడుకలను కొత్తపేట డివిజన్ ప్రజయ్‌నివాస్ ఫేస్ 1, బ్లాక్ 2లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సమస్త నిర్వాహకులు సిద్ధార్థ్ వద్ద శిక్షణ పొందిన శిష్య బృందం వివిధ నృత్య ప్రదర్శనలతో అందరినీ ఆకట్టుకున్నారు. నృత్య ప్రదర్శనలో భాగంగా జంబ డాన్స్ విధానం ద్వారా మహిళ అభిమానులను ఎంతగానో ఆకట్టుకుంది. ఈ కార్యక్రమానికి విశిష్ట అతిథులుగా తరుణ్ మాస్టర్, జస్వంత్ మాస్టర్, తెలంగాణ బార్ కౌన్సిల్ సబ్యురాలు బర్ల సునీత హాజరై నిర్వాహకులను అభినందించారు. హైకోర్టు న్యాయవాది వెన్న జయప్రద నేతృత్వంలో కార్యక్రమం విజయవంతంగా నిర్వహించారు. నృత్య ప్రదర్శన తీరుపట్ల కళాకారులను పలువురు అభినందించారు.

ప్రైవేటు పాఠశాలల ఫీజు దొపిడిని అరికట్టాలి : బ్రహ్మయ్య

ఎల్.బి.నగర్, జూన్ 10 ప్రభాతవార్త:
ప్రైవేటు పాఠశాలలో నిబంధనలకు విరుద్ధంగా ఇష్టారాజ్యంగా ఫీజుల పేరిట దొపిడీకి పాల్పడుతుందని మన ఆలోచన సాధన సమితి రాష్ట్ర ప్రచార కార్యదర్శి పెద్ద వూరబ్రహ్మయ్య ఆరోపించారు.ప్రైవేట్ స్కూళ్లలో ఫీజుల దొపిడిని అరికట్టి, జీవో నెంబర్ 7ను వెంటనే రద్దు చేసి, ఫీజ్ రియంబర్స్మెంట్ పదివేల కోట్లు వెంటనే విడుదల చేయించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ పాఠశాలలో సరైన వసతులు లేకపోవడంతో తల్లిదండ్రులు ప్రైవేట్ పాఠశాల వైపు మొగ్గు చూపే పరిస్థితి నెలకొందన్నారు. ప్రభుత్వ పాఠశాలలో కూడా కార్పొరేటర్ స్థాయి సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు.విద్యారంగాన్ని వ్యాపారంగా మార్చి అధిక ఫీజులతో తల్లిదండ్రులను ఇబ్బందులకు గురి చేస్తున్నా కార్పొరేట్ విద్యా సంస్థల పైన ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. జూన్ నెల ప్రారంభంలో స్కూల్ ఫీజులు ,పుస్తకాలు, బ్యాగులు, బూట్లు తదితర ఖర్చులతో తల్లిదండ్రులపై తీవ్ర ఆర్థిక భారం పడుతుందన్నారు. ఈ పరిస్థితిని నివారించేందుకు ప్రభుత్వ విద్యా వ్యవస్థను బలోపేతం చేయాలని,ప్రతి నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలలో మౌలిక వసతులుఉపాధ్యాయ నియామకాలు, తాగునీరు, మరుగుదిడ్లు, ఫర్నిచర్, డిజిటల్ విద్యా వంటి,సదుపాయాలు కల్పించి ప్రభుత్వ విద్య ను మరింత పటిష్టం చేయాలన్నారు.కోరుకుంటున్నాం. ప్రభుత్వం స్పందించకపోతే బీసీ,ఎస్సీ,ఎస్టీ, మైనార్టీ లతో పెద్ద ఎత్తున ఆందొళన చేపడతామని హెచ్చరించారు.

నిధులు మంజూరు చేయాలని వినతి

ఎంఎంసి కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న దర్పల్లి రాజశేఖర్‌రెడ్డి

సైదాబాద్, జూన్ 10 ప్రభాతవార్త: లింగోజిగూడ డివిజన్‌లో వివిధ అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాలని కోరుతూ ఎంఎంసి కమీషనర్ వినయ్ కృష్ణారెడ్డికి మాజీ కార్పొరేటర్ దర్పల్లి రాజశేఖర్‌రెడ్డి వినతిపత్రం సమర్పించారు. సరూర్‌నగర్ చెరువు కట్ట వద్ద నూతనంగా నిర్మించే వంతెన పరిసర ప్రాంతాలలో సుందరీకరణ కోసం అదనపు నిధులు మంజూరు చేయాలని, గ